www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం|| లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 159 | బుధవారం 29.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## మిగిలింది వారమే..'సర్'

- మల్కాజిగిరిలో 3.77 లక్షల మంది డిజిటలైజేషన్ పూర్తి
- మృతులు, అడ్రస్ మారిన వారు కలిపి 88 వేల మందికి పైగా గుర్తింపు
- ఆగస్టు 3తో ముగియనున్న సర్ ప్రక్రియ
- వారంలో లక్ష మందికి పైగా ఎన్యుమరేషన్ పూర్తి చేయడం సవాల్
- ఏపీ ఓటర్లు స్థానికంగా పత్రాలు ఇవ్వడానికి నిరాకరణ
- యాప్‌లో వివరాల అప్‌లోడ్‌కు ప్రత్యేక కేంద్రాల్లో ముమ్మర కసరత్తు

03




**స్పందించాల్సిన ఓటర్లు ఇంకా 1.35 లక్షలకు పైగా**

## నకిలీ డీఏపీ ఎరువుల కలకలం..




**ప్రభుత్వం సీరియస్.. విచారణకు ఆదేశాలు.!**

వికారాబాద్‌లో నకిలీ డీఏపీ బస్తాల స్వాధీనం

**పొలాల్లో చల్లిన ఎరువులతో బొబ్బలు**

- రైతులకు అప్రమత్తంగా ఉండాలని సూచనలు
- నకిలీ డీఏపీ విక్రయాలపై విచారణ వేగం
- అసలైన బస్తాల్లా నకిలీ తయారీ
- రాష్ట్రవ్యాప్తంగా నకిలీ ఎరువుల కలకలం
- నకిలీ డీఏపీ వెనుక ముఠా గుట్టురట్టు
- వ్యవసాయశాఖ అప్రమత్తమైన అధికారులు
- నకిలీ ఎరువుల దందాపై ఉక్కుపాదం
- తెలంగాణలో నకిలీ డీఏపీ ఎరువుల కలకలం
- రైతులను మోసం చేసిన నకిలీ ముఠా

02

# 90 రోజుల పాటు ఉపాధి కల్పించాలి..

## 'హైడ్రా' రద్దు కోరుకునేది కబ్జాదారులే..

**ఆన్‌లైన్ పరీక్షలతో నో టెన్షన్..**

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విపక్షాల ఫేక్ ప్రచారం**

**కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం**



- రైతులకు కొత్త పనుల అనుమతి కోరిన సీఎం
- గ్రామీణాభివృద్ధిపై కేంద్రంతో విస్తృత చర్చలు
- ఆన్‌లైన్ పరీక్షలకే సీఎం రేవంత్ మద్దతు
- పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు కోరిన సీఎం
- విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విపక్షాలపై విమర్శలు
- ఫేక్ ప్రచారం చేస్తున్నారన్న సీఎం రేవంత్
- హైడ్రా రద్దు కోరేది కబ్జాదారులేనన్న సీఎం
- కబ్జాదారులను ఎట్టి పరిస్థితుల్లో వదలమన్న సీఎం
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై ఆగ్రహం
- కోర్టు తీర్పు తర్వాత కార్యాచరణ నిర్ణయం
- హైడ్రాపై ప్రభుత్వానికి పూర్తి స్పష్టత

02

**హైడ్రా అధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ ప్రభుత్వానికి ఉంది**

**ఢిల్లీ :**

సీఎం రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన బిజీబిజీగా సాగుతోంది. ఈ మేరకు ఇవాళ మధ్యాహ్నం ఆయన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, ఉపాధి హామీ పథకంలో కొత్త పనుల చేరిక, నివాస గృహాల నిర్మాణాలకు సంబంధించిన వివరాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి విస్తృతంగా చర్చించారు.

**90 రోజుల పాటు ఉపాధి కల్పించాలి..**

ఈ భేటీలో ప్రధానంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ్ 2.0 కింద తెలంగాణ రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



**తెలంగాణలో బీజేపీదే అధికారం**

## ఆ ఒక్క ఫెయిల్యూర్ చాలు..

### మాట్లాడుకునే రేవంత్, కేటీఆర్ ఢిల్లీ టూర్

**లక్షల మందితో హైదరాబాద్‌లో ధర్నా ప్లాన్ చేయాలి**

**యూరియాను బ్లాక్‌లో అమ్ముకొని కేంద్రంపై నెపం**

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కాంగ్రెస్‌ను నిలదీశారు
- విద్యార్థులతో భారీ ధర్నా హెచ్చరిక
- ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా ప్రస్తావించిన అర్వింద్
- జెన్ జీపై సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన అర్వింద్
- రేవంత్, కేటీఆర్‌పై అర్వింద్ ఆరోపణలు
- ఢిల్లీ టూర్‌పై అర్వింద్ సంచలన వ్యాఖ్యలు
- కాళేశ్వరం విచారణపై ప్రశ్నించిన అర్వింద్
- యూరియా కొరతపై కేంద్రాన్ని నిందించొద్దు

03

ఒకసారి నీట్ పేపర్ లీకైనందుకు మా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేశారని మరి తెలంగాణలో ప్రతి ఏడాది 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్ మెంట్ రాక ఇబ్బందులు పడుతున్నారని అలాంటిది ఏ ముఖం పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. జెన్ జీల గురించి మాట్లాడుతున్న సీఎం ముందు తన వద్ద ఉన్న విద్యాశాఖను కాంగ్రెస్‌లో ఉన్న యువ ఎమ్మెల్యేలకు ఇవ్వాలని సూచించారు.



**రాహుల్ గాంధీ ధర్నాతో సీజేపీ ఉద్యమం పీక్స్ కు**

జెన్ జీ ఆలోచన సీఎం రేవంత్‌దే
యువతకు సీఎం రేవంత్ దగ్గరిత
నమన్న శ్రీధర్ బాబు
నీట్ నిరసన కేంద్రానికి చెంపపెట్టు
విద్యార్థుల ఉద్యమానికి కాంగ్రెస్ మద్దతు
రాహుల్‌తో ఉద్యమం ఊపందు
కుందన్న మంత్రి

03



## తప్పిన పెను ప్రమాదం..

### ప్రమాదంతో తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన

- పెను ప్రమాదం నుంచి విద్యార్థులు సురక్షితం
- స్కూల్ బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- తృటిలో తప్పిన భారీ ప్రమాదం
- విద్యార్థులు క్షేమంగా బయటపడ్డారు
- ప్రమాదంతో తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన
- పోలీసులు ట్రాఫిక్ పునరుద్ధరణ చేపట్టారు
- జగిత్యాలలో స్కూల్ బస్సుకు ప్రమాదం

02

## నేను ఎక్కడికీ పారిపోలేదు..

**ఆరోపణలు అన్నీ అవాస్తవం..నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటా!**

- ఉదయ్ కృష్ణారెడ్డి ఆరోపణలను ఖండించారు
- నేను పరారీలో లేనన్న ఉదయ్
- విచారణకు సహకరిస్తానన్న ట్రైనీ ఐపీఎస్
- న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం వ్యక్తం
- స్వగ్రామానికి వెళ్లానన్న ఉదయ్
- నిర్దోషిత్వం నిరూపిస్తానన్న ఉదయ్

02

త్వరలో నిజాలు వెలుగులోకి వస్తాయి




**కంగనా రనౌత్ వివాదాస్పద వ్యాఖ్యలు**

## వాళ్లను ఏ కోణంలో విద్యార్థులుగా చూడాలి..

### మీడియా ముందే బూతులు తగవన్న కంగనా

- విద్యార్థుల ఆందోళనపై కంగనా వివాదాస్పద
- వ్యాఖ్యలునీట్ నిరసనల్లో బూతులు తప్పంటున్న కంగ
- నావిద్యార్థుల ప్రవర్తనపై కంగనా ఆగ్రహంఅలా
- మాట్లాడేవారు విద్యార్థులేనా? కంగనా ప్రశ్నఅమ్మాయిల
- వ్యాఖ్యలపై కంగనా అసంతృప్తిభవిష్యత్తుపై కంగనా
- హెచ్చరికట్రోల్స్‌కు భయపడనన్న కంగనాసోషల్
- మీడియా ట్రోల్స్‌పై కంగనా స్పందనవిద్యార్థుల
- సంస్కారంపై కంగనా విమర్శలు
- తల్లిదండ్రుల విలువ తగ్గుతోందన్న కంగనా

03



**16 ఏళ్లకే కెరీర్ ప్రారంభించానన్న కంగనా**

**ట్రోల్స్ వచ్చినా భయంలేదన్న కంగనా**



## రూపాయి సాయం అందలేదు

**బాధితులకు కోటి పరిహారం ఇవ్వాలి**

### కేటీఆర్‌కు కవిత కీలక విజ్ఞప్తి

- న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది
- దమనకాండపై అన్ని పార్టీలు కలిసిరావాలి
- మానవ హక్కుల ఉల్లంఘనపై కవిత ఆవేదన
- నెరేళ్ల బాధితులకు న్యాయం కోరిన కవిత
- పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- నెరేళ్ల ఘటనపై కవిత తీవ్ర వ్యాఖ్యలు
- బాధిత కుటుంబాలకు అండగా తెలంగాణ రక్షణ సేన
- పోలీసుల దాష్టీకాన్ని ఖండించిన కవిత
- ప్రభుత్వాల వైఫల్యంపై కవిత విమర్శలు
- నెరేళ్ల బాధితులకు అండగా కవిత

03

బాధిత కుటుంబాలకు అండగా తెలంగాణ రక్షణ సేన

**దమనకాండపై అన్ని పార్టీలు కలిసిరావాలి**

# నకిలీ డీఏపీ ఎరువుల కలకలం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో నకిలీ డీఏపీ ఎరువుల వ్యవహారం కలకలం రేపుతోంది. రైతులను లక్ష్యంగా చేసుకుని నకిలీ ఎరువులను విక్రయిస్తున్న ముఠాపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. మరోవైపు నకిలీ ఎరువుల తయారీ, సరఫరా వెనుక ఉన్న ముఠాను గుర్తించేందుకు పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు.ప్రాథమిక విచారణలో ఈ నకిలీ డీఏపీ ఎరువులు కర్ణాటకలో తయారైనట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత వాటిని తెలంగాణలోని పలు జిల్లాలకు తరలించి విక్రయించినట్లు అనుమానిస్తున్నారు. రైతులకు ఎలాంటి అనుమానం రాకుండా అసలైన డీఏపీ బస్తాలను పోలి ఉండేలా తయారు చేయడమే కాకుండా, వాటిపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను కూడా ముద్రించినట్లు అధికారులు వెల్లడించారు.వికారాబాద్ జిల్లా విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం మంచన్‌పల్లిలో 106 నకిలీ డీఏపీ బస్తాలు గుర్తించారు. అలాగే పరిగి మండలం చిగురాల్‌పల్లిలో 25 మంది రైతులు మొత్తం 275 నకిలీ డీఏపీ బస్తాలు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది.కొంతమంది రైతులు ఇప్పటికే ఈ నకిలీ ఎరువులను తమ పొలాల్లో ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు. మంచన్‌పల్లిలో లభ్యమైన 106 బస్తాలు, చిగురాల్‌పల్లిలో గుర్తించిన 27 బస్తాలను స్వాధీనం చేసుకుని చన్గోముల్, పరిగి పోలీస్ స్టేషన్లకు తరలించారు. రైతులు కొనుగోలు చేసిన నకిలీ డీఏపీపై విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల విచారణలో నకిలీ ఎరువుల ముఠా కొంతమంది సర్పంచ్‌లను అడ్డం పెట్టుకుని ఈ దందా నిర్వహించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం కూడా ఉండే అవకాశం ఉందని భావిస్తున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. మరోవైపు నకిలీ డీఏపీ ఎరువులను పొలాల్లో చల్లిన రైతుల చేతులకు బొబ్బలు వచ్చినట్లు సమాచారం.

# తప్పిన పెను ప్రమాదం..

## స్కూల్ బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.!

**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం పెను ప్రమాదం తృటిలో తప్పింది. జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డులో విద్యార్థులతో వెళ్తున్న తక్షశిల ప్రైవేట్ స్కూల్ బస్సును ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనతో ఒక్కసారిగా అక్కడ భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాదం ధాటికి ఆర్టీసీ బస్సు ముందు అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే స్కూల్ బస్సులో ఉన్న విద్యార్థులు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో విద్యార్థులు ఉండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడం పెద్ద ఊరటనిచ్చింది. భారీ ప్రమాదం క్షణాల్లో తప్పింది. నిజానికి ప్రమాదం తీవ్రతను చూసిన వారు పెద్ద ప్రమాదమే జరిగేదని అభిప్రాయపడ్డారు. దీనితో ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా కొంతసేపు యావర్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దానితో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

# నేను ఎక్కడికీ పారిపోలేదు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తనపై వచ్చిన ఆరోపణలపై ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణా రెడ్డి స్పందించారు. తనపై తోటి ఐపీఎస్ అధికారి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, పరారీలో లేనని చెప్పారు. మీడియాలో వచ్చిన కథనాలను చూసి నానమ్మ అనారోగ్యానికి గురైందని, ఆమెను చూసేందుకు స్వగ్రామం ఊళ్లపాలెం వచ్చానన్నారు. న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థలపై పూర్తి విశ్వాసంతోనే విచారణకు సహకరిస్తున్నానని తెలిపారు. కేసు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున దీనిపై మరిన్ని వివరాలు వెల్లడించలేనని ఉదయ్ కృష్ణా రెడ్డి పేర్కొన్నారు.ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణా రెడ్డి ఎన్టీవీతో ప్రత్యేకంగా మాట్లాడారు. తన నాయనమ్మను పరామర్శించేందుకే తన స్వగ్రామమైన ఊళ్లపాలెంకు వెళ్లానని, దానిని పరారిగా చిత్రీకరించడం సరైంది కాదన్నారు. 'నామీద నాతోటి ఐపీఎస్ చేసిన ఆరోపణలు అవాస్తవం. మీడియాలో వచ్చిన కథనాలను చూసి మా నాయనమ్మ అనారోగ్యానికి గురైంది. అందుకే ఆమెను చూసేందుకు మా స్వగ్రామం ఊళ్లపాలెం వెళ్లాను. నేను పరారీలో లేను. న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థలపై నాకు పూర్తి నమ్మకం ఉంది. విచారణ అధికారులకు పూర్తిగా సహకరిస్తాను. గ్రామీణ నేపథ్యం నుంచి కష్టపడి ఈ స్థాయికి వచ్చాను. ఎప్పుడూ విలువలకు కట్టుబడి ఉంటాను' అని ఉదయ్ కృష్ణా రెడ్డి అన్నారు.'కేసు ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున ఎక్కువ విషయాలు మాట్లాడడం సమంజసం కాదు. పోలీసులు నోటీసులు ఇవ్వడానికి హైదరాబాద్‌లో రెండు చిరునామాలకు వెళ్లారని తెలిసింది. అవి తాత్కాలిక చిరునామాలే. తన శాశ్వత చిరునామా అయిన ప్రకాశం జిల్లా ఊళ్లపాలెంకు ఎలాంటి నోటీసులు అందలేదు. విచారణ అధికారులకు సహకరించేందుకు నేనే స్వచ్ఛందంగా హైదరాబాద్‌కు వెళ్తున్నా. పోలీస్, న్యాయ వ్యవస్థలపై నమ్మకం ఉంది. విచారణలో నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటా. నాకు పూర్తి విశ్వాసం ఉంది, నిజాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయి' అని ఉదయ్ కృష్ణా రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# 90 రోజుల పాటు ఉపాధి కల్పించాలి..

## 'హైడ్రా' రద్దు కొరుకునేది కబ్జాదారులే..

**ఢిల్లీ :** సీఎం రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన బిజీబిజీగా సాగుతోంది. ఈ మేరకు ఇవాళ మధ్యాహ్నం ఆయన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, ఉపాధి హామీ పథకంలో కొత్త పనుల చేరిక, నివాస గృహాల నిర్మాణాలకు సంబంధించిన వివరాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి విస్తృతంగా చర్చించారు.

**90 రోజుల పాటు ఉపాధి కల్పించాలి..**

ఈ భేటీలో ప్రధానంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్ 2.0 కింద తెలంగాణ రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణలో గ్రామీణ ఇళ్ల నిర్మాణాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని, కాబట్టి ఈసారి రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన వివరించారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వీబీ-జీ రామ్-జీ జాబితాలో చేర్చి, లబ్ధిదారులకు 90 రోజుల పాటు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా ఎల్‌నినో ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వీబీ-జీ రామ్-జీ పథకంలో అదనపు పనులను చేర్చాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. రైతుల జీవనోపాధిని మెరుగుపరిచే దిశగా కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణం వంటి 10 రకాల కొత్త పనులకు అనుమతి ఇవ్వాలని సీఎం కోరారు. వీటితో పాటు రైతుల భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ భూముల పునరుద్ధరణ పనులకు కూడా ఉపాధి హామీ కింద అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను రేవంత్ రెడ్డి కోరారు.

**'హైడ్రా' రద్దు కొరుకునేది కబ్జాదారులే..**

దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పరీక్షల నిర్వహణ, ఫీజు రీయింబర్స్‌మెంట్, హైడ్రా అంశాలపై ఆయన స్పష్టమైన ప్రకటన చేశారు.

**ఆన్‌లైన్ పరీక్షలతో నో టెన్షన్..**

ఉద్యోగ పోటీ పరీక్షలైనా, ఉన్నత చదువుల పరీక్షలైనా.. ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తేనే సమస్యలు వస్తున్నాయని, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తే ఏ సమస్యా ఉండదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశంలో పేపర్ లీక్‌కు పాల్పడిన బాధ్యులను కఠినంగా శిక్షించాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి కొన్ని పరీక్షలను విద్యాశాఖలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అధికారాలను కేంద్ర ప్రభుత్వం లాక్కునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం ఎలాంటి బేషజాలు పోకుండా దేశంలో అత్యున్నత పరీక్షల యూనివర్సిటీలు, ఇతర స్వతంత్ర సంస్థలపై ఆధిపత్యం చెలాయించకుండా ఉంటే బెటర్ అని హితవు పలికారు. పేపర్ లీకేజీలపై పార్లమెంట్ ఉభయ సభల్లో సమగ్రంగా చర్చ జరగాలని, అంతిమంగా విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. తమ అధినేత రాహుల్ గాంధీ లోక్‌సభలో విద్యార్థుల పక్షాన నిలబడి కొట్లాడుతున్నారని, ఈ విషయంలో మిత్రపక్షాలన్నీ కలిసి రావాలని పిలుపునిచ్చారు. విద్య వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విపక్షాల ఫేక్ ప్రచారం**

తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రశ్నాపత్రాల లీకేజీపై కఠినంగా ఉంటామని సీఎం చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఆ బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేసి నియామకాలు చేపడుతున్నామని అన్నారు. గ్లోబరీనా లాంటి సంస్థలు నాడు తెలంగాణలో అక్రమాలకు పాల్పడ్డాయని, నాడు ఆ సంస్థపై చర్యలు తీసుకుని ఉంటే నేడు సీబీఎస్ఈలో గందరగోళం జరిగే పరిస్థితి ఉండేది కాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరిట భారీ దోపిడీ జరిగిందని, ఇవాళ అన్ని అక్రమాలపై విచారణకు ఆదేశించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మళ్లీ నేడు ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో తాము ఏదో తప్పు చేసినట్లుగా, చెల్లింపుల్లో ఆలస్యం చేస్తున్నట్లుగా ప్రధాన ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో ఏపీ రాజ్యసభ సభ్యుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి మాట్లాడుతున్నారని, కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఆయన భాగస్వామిగా ఉన్న ప్రభుత్వం రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో పెడితే ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వందకు వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేశాక.. ఆర్.కృష్ణయ్య గానీ, బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, కిషన్ రెడ్డి గానీ తెలంగాణ ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి మాట్లాడాలని హితవు పలికారు.

**కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం**

హైడ్రాను రద్దు చేయాలని దొంగలు, కబ్జాకోరులు, బీఆర్ఎస్ వాళ్లు మాత్రమే అంటున్నారని సీఎం రేవంత్ సీరియస్ అయ్యారు. గండిపేట బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదల.. పెద్దలా? ఎన్ కన్వెన్షన్ పేదలదా.. పెద్దలదా? అని ప్రశ్నించారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. హైడ్రా అనేది తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణ అని, ఏ అధికారిని నియమించాలనే విచక్షణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని తెలిపారు. సోమేశ్ కుమార్ పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నేతలు దురుద్దేశంతో కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారని, కోర్టు తీర్పుని పరిశీలించి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణపైన తమకు పూర్తి స్పష్టత ఉందని, కబ్జాకోరులకు మీడియా కూడా సహకరించవద్దని విజ్ఞప్తి చేశారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రైతులు ఆరుతడి పంటలవైపు మొగ్గు చూపాలి






**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల వైపు వెళ్లాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. కొంతమంది రైతులు ఇదివరకే పత్తి, కంది వంటి పంటలు సాగు చేయడం జరిగిందని, అలాంటి పంటల్లో అంతర పంటలు వేసుకోవాలని, తద్వారా పంటల సాగు ఖర్చు తగ్గుతుందని తెలిపారు.మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ నిర్వహించిన "రైతు నేస్తం 100 వ ఎపిసోడ్" కార్యక్రమానికి హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరు కాగా, జిల్లాలోని దోమలపల్లి రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కార్యక్రమానికి హాజరైన, రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, అల్పపీడనద్రోణి వల్ల సెప్టెంబర్ మాసంలో కూడా వర్షాలు వచ్చే అవకాశం లేదని, అంతేకాక ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలలో కూడా వర్షాలు లేనందున, శ్రీశైలం ప్రాజెక్టు నిండే అవకాశం లేదని, అందువల్ల నల్గొండ జిల్లాకు జీవనాధారమైన నాగార్జునసాగర్, ఏ ఎంఆర్పి ప్రాజెక్టులు కూడా నిండే పరిస్థితి లేదని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని వాస్తవ పరిస్థితులను గమనించి ఆరుతడి పంటలు వేసుకోవాలని చెప్పారు. ఇదివరకే పత్తి,కంది పంటలు వేసుకున్న వారు అంతర పంటలు వేసుకోవచ్చని సూచించారు. వీటితోపాటు, ఉద్యాన పంటలు, కూరగాయల సాగు చేయవచ్చని, ప్రభుత్వం సబ్సిడీపై బిందు పరికరాలను అందజేస్తుందని తెలిపారు. రైతులు ఆరుతడి పంటల కింద సజ్జ, కొర్రలు ,సామలు వంటి పంటలను సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే ఏర్పాటు చేస్తుందని తెలిపారు.అంతకుముందు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు "రైతు నేస్తం 100వ ఎపిసోడ్" లో మాట్లాడుతూ, రైతు నేస్తం ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు వాతావరణ పరిస్థితులు, సాగు పద్ధతులు, పంటలు, ఎరువులు, నూతన విషయాలన్నీ రైతుల ముందు ఉంచడం జరుగుతుందని, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, ఆలోచనలు ,అలాగే రైతుల అభిప్రాయాలను పంచుకునేందుకు రైతు వేదికలు సమన్వయ వేదికలుగా ఉన్నాయని, రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా బోర్లు, ఎత్తిపోతల పథకాల కింద, అలాగే సాధారణ వ్యవసాయం ఎలా చేయాలో కూడా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు తెలియజేస్తారని చెప్పారు. ఎల్ నినో దృష్ట్యా రైతులు ఉద్యాన పంటలు,ఆరు తడి పంటల వైపు వెళ్లాలని, సజ్జలు, సామలు, కొర్రలు వంటి పంటలు నెలరోజుల వరకు నీళ్లు లేకున్నా పండుతాయని, వీటిని అంతర పంటలుగా వేసుకోవచ్చని ,అంతేకాక ఆయిల్ ఫామ్ వల్ల స్థిరమైన ఆదాయం వస్తుందని, ఆయిల్ పామ్ తోటలు సాగుకు పురుగుల బెడద, ఎలిమినో , కోతుల బెడద వంటివి ఉండదని అన్నారు. రైతు నేస్తం ద్వారా అందించే వ్యవసాయ యాంత్రీకరణ, పద్ధతులు తెలుసుకుంటూ వ్యవసాయం సాగు చేస్తే త్వరగా వ్యవసాయం ముందుకు వెళుతుందని, రైతులు కష్టాల భారం నుండి తప్పించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా హార్టికల్చర్ డిడి శేఖర్ , హార్టికల్చర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# రూపాయి సాయం అందలేదు

## నెరేళ్ల ఘటనపై కల్వకుంట్ల కవిత ఫైర్!

**తంగళ్లపల్లి,ఫ్లాష్ ఇండియా :** నెరేళ్లలో జరిగిన దాష్టీకానికి సిగ్గుతో తలదించుకోవాలని, అప్పుడు పాలించిన వారి కుటుంబంలో ఒక సభ్యురాలిగా ఉన్న తాను బాధితులను క్షమాపణ కోరుతున్నానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. మంగళవారం కవిత నెరెళ్ల ఘటనలో చనిపోయిన గంధం గోపాల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ వస్తే మన జీవితాలు బాగుపడతాయని అందరం కొట్లాడి స్వరాష్ట్రం సాధించుకున్నామని, కానీ నెరేళ్ల ఘటన మనమంతా సిగ్గుతో తలదించుకునేలా చేసిందన్నారు. ఘటన జరిగినప్పుడు ఉన్న ప్రభుత్వంలోని కుటుంబంలో నేను కూడా సభ్యురాలినేనని, అందుకు సిగ్గుతో తలదించుకుంటూ.. మీ అందరినీ క్షమాపణ అడుగుతున్నాను అన్నారు. కొందరి ధన దాహం కోసం ఎంతో మంది ప్రాణాలు కోల్పోయేలా చేశారని, ఇసుక లారీల కారణంగా ఒక బిడ్డ ప్రాణం పోతే ఇక్కడి ప్రజలు ఆందోళన చేశారని, దానికే వాళ్లపై పోలీసులు దాష్టీకం చేశారన్నారు. ఐదు రోజుల పాటు 8 మందిని ఇష్టానుసారంగా కొట్టారని, జైలర్ కూడా వాళ్లను జైల్లోకి తీసుకోలేమని చెప్పే అంతగా కొట్టారన్నారు. ఈ దాష్టీకానికి పాల్పడిన ఒక్క పోలీసు కైనా శిక్ష పడిందా..? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని, కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ప్రశ్నించారు. ఎమ్మెల్యే కేటీఆర్ ఏం చేస్తున్నాడని, బండి సంజయ్ కి ఏమైందన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ ను తీసుకొచ్చారని, కానీ దాని రిపోర్ట్ ఇప్పటికీ కూడా రాలేదన్నారు. అసలు ఏమైందో బండి సంజయ్ సమాధానం చెప్పాలన్నారు. ధన దాహం కోసం పేదల ప్రాణాలు తీసిన బడా బాబులకు ఒక్కరికైనా శిక్ష పడిందా? అంటూ నిలదీశారు. బాధితులను మేము ఏదో పరామర్శించేందుకు టూరిస్టుల మాదిరిగా రాలేదని, ఖచ్చితంగా ఎస్సీ కమిషన్ రిపోర్ట్ కోసం పోరాటం చేస్తామన్నారు. అవసంమైతే నెరేళ్ల బాధితులతో కలిసి ఢిల్లీకి వెళ్తామన్నారు. నెరేళ్ల బాధితుల మీద దాష్టీకానికి పాల్పడిన ఎస్పీపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్ చెప్పిందని, కానీ ఒక ఎస్పైని బలి పశువును చేసి, దమనకాండ చేసిన వాళ్లను వదిలి పెట్టారన్నారు. ఎన్నికలకు ముందు నెరేళ్ల బాధితుల పేరు చెప్పుకొని రేవంత్ రెడ్డి ఓట్లు వేయించుకున్నారని, 30 నెలలు గడిచినా సరే ఇప్పటి వరకు నెరేళ్ల బాధితుల పేరు ఎత్తలేదన్నారు. అసలు ఈ ముఖ్యమంత్రికి కనీస మానవత్వం ఉందా..? అని మండిపడ్డారు. అన్ని పార్టీలు నెరేళ్ల బాధితుల కుటుంబాలను ఆదుకోవాలని, ఈ దమనకాండకు పాల్పడిన వాళ్లపై కలిసి పోరాటం చేద్దామన్నారు. ఈ విషయంలో రాజకీయం వద్దని, గత ప్రభుత్వంలోనూ, ఈ ప్రభుత్వంలోనూ ప్రశ్నించే వాళ్ల పై దాష్టీకానికి పాల్పడుతున్నారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, భట్టి విక్రమార్క, అడ్లూరి లక్ష్మణ్ కూడా మానవత్వం మరిచారని, మీరా కుమార్ ని తీసుకొచ్చి న్యాయం చేస్తామని మాట ఇచ్చారని, ఇప్పటివరకు ఏం చేశారని ప్రశ్నించారు. నెరేళ్ల బాధితులు కన్నీళ్ల పునాదుల మీద అధికారం అనుభవిస్తున్నారన్నారు. చనిపోయిన గోపాల్ కుటుంబం 9 ఏళ్లపాటు హాస్పిటల్స్ చుట్టూ తిరిగిందని, ఒక్క రూపాయి కూడా వారికి ప్రభుత్వం నుంచి అందలేదన్నారు. ఎమ్మెల్యే కేటీఆర్ బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని, వాళ్ల పిల్లల చదువుల ఖర్చు భరించాలన్నారు. నెరేళ్ల బాధితులందరికీ కచ్చితంగా ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దాష్టీకానికి పాల్పడిన పోలీసులకు శిక్ష పడాలన్నారు. తెలంగాణ రక్షణ సేన అంటే తెలంగాణను రక్షించుకునేందుకే పెట్టిన పార్టీ అని, ప్రశ్నిస్తాం, పోరాడుతాం, పరిష్కరిస్తామని, నెరేళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

# ఆ ఒక్క ఫెయిల్యూర్ చాలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఒకసారి నీట్ పేపర్ లీకైనందుకు మా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేశారని మరి తెలంగాణలో ప్రతి ఏడాది 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్ మెంట్ రాక ఇబ్బందులు పడుతున్నారని అలాంటిది ఏ ముఖం పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. జెన్ జీల గురించి మాట్లాడుతున్న సీఎం ముందు తన వద్ద ఉన్న విద్యాశాఖను కాంగ్రెస్‌లో ఉన్న యువ ఎమ్మెల్యేలకు ఇవ్వాలని సూచించారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యేది లేదు ఏమి లేదని అలాంటిది రేవంత్ రెడ్డి కేంద్ర విద్యాశాఖ మంత్రి ఎవరో నిర్ణయించే పనిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి వైఖరి చూస్తే రాహుల్ గాంధీని సైడ్ చేసి ప్రధాని కావాలనే ఆలోచనతో ఉన్నారా అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇవాళ ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన అర్వింద్.. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి విద్యార్థుల జీవితాలతో చలగాటం అడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో కాలేజీలు మూసేసే పరిస్థితి ఉందన్నారు.

**లక్షల మందితో హైదరాబాద్‌లో ధర్నా ప్లాన్ చేయాలి**

హైకోర్టు రంగనాథ్ చెంప చెల్లుమనిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాచిపోయిందని సెటైర్ వేశారు. రాష్ట్రంలోని జెన్ జీ పడుతున్న ఇబ్బందులు పడుతున్న అవేవి పట్టించుకోకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఫీజురీయింబర్స్ మెంట్ వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అందువల్ల తొందరలోనే లక్ష మంది విద్యార్థులతో హైదరాబాద్‌లో భారీ ధర్నాకు ప్లాన్ చేస్తున్నామన్నారు. ఫీజు రీయింబర్స్ వైఫల్యం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోయి బీజేపీ అధికారంలోకి రావడానికి ఉపయోగపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి కేబినెట్ మంత్రుల యావరేజ్ ఏజ్ 62 ఏళ్లు అని, కాంగ్రెస్ పార్టీ పూరాతనమైన పార్టీ అని వీళ్లు జెన్ జీ గురించి మాట్లాడతారా అని నిలదీశారు.

**మాట్లాడుకునే రేవంత్, కేటీఆర్ ఢిల్లీ టూర్:**

సీఎం రేవంత్ రెడ్డి, కేటీఆర్ మాట్లాడుకునే ఒకే సారి ఢిల్లీ పర్యటనకు వచ్చారని అర్వింద్ ఆరోపించారు. ఈ-కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరంతో పాటు అనేక అంశాల్లో ఈ రెండు పార్టీలు కోఆర్డినేట్‌తోనే నడుస్తున్నాయన్నారు. రేవంత్ రెడ్డి తనకు మిత్రుడని సీఎం అయ్యాక అధికారమే లక్ష్యంగా, అవినీతే పరమావధిగా, కుటుంబ పాలననే తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్రాన్ని దోచుకుని బీఆర్ఎస్ వెళ్లిపోతే ఆ దొంగలను దోచుకునేందుకు కోఆర్డినేషన్ తో ఢిల్లీకి ఇద్దరు వచ్చారన్నారు. సీబీఐ విచారణకు కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిగా కాకుండా కేవలం మూడు బ్యారేజీలకు మాత్రమే ఎందుకు పరిమితం చేశారని నిలదీశారు.

**యూరియాను బ్లాక్‌లో అమ్ముకొని కేంద్రంపై నెపం:**

రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాక ఇతరులపై బురద జల్లే పని చేస్తున్నారని అర్వింద్ విమర్శించారు. రేవంత్ రెడ్డి యూరియాను బ్లాక్‌లో అమ్ముకొని, కొరత వచ్చిందని కేంద్రంపై నెడుతున్నాడని మండిపడ్డారు. తెలంగాణకు 2016-17లో 26.13 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు ఇస్తే.. 2025-26లో 42.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కేంద్రం నుండి వచ్చిందని ఏప్రిల్ నుండి జూలై మధ్యలో DAPలో 28 షోకాజ్ నోటీసులు, 9 లైసెన్స్ క్యాన్సిలేషన్లు, 3 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు. వీటిపై ఇన్వెస్టిగేషన్ చేస్తే అందరూ కాంగ్రెస్ వాళ్లే ఉన్నారని ధ్వజమెత్తారు.

# ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటాలు వామపక్ష సామాజిక శక్తుల ఐక్యతతో బలపడాలి




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గడిచిన పన్నెండునర సంవత్సరాలలో బిజెపి ప్రభుత్వ వైఫల్యాలు వలన దేశంలో ప్రజా వ్యతిరేక పెరుగుతుందని,మోదీ పాలనతో ప్రజాస్వామ్య వ్యవస్థను ధ్వంసం అయ్యే నుండి ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటాలు వామపక్ష సామాజిక శక్తుల ఐక్యతతో జరగాలని ఎంసిపిఐ(యు) అఖిలభారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో స్వాగత్ హోటల్లో ఈ నెల 28,29 తేదీల్లో రెండు రోజులపాటు ఎంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు మొదటి రోజు ప్రారంభమైనవి. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మద్దికాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగ,ప్రజాస్వామ్య రక్షణ కోసం ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటాలు వామపక్ష సామాజిక శక్తులు ఐక్యతతో సాధ్యం చేయడానికి ఎంసిపిఐ(యు) పార్టీ తన కృషిని విస్తృతం చేస్తుందని అన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల వాగ్దానాలపై పోరాటాలను నిర్వహిస్తాం**

నీళ్లు నిధులు నియామకాల పేరుతో ఏర్పడ్డ తెలంగాణను పది సంవత్సరాలు పాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వ తప్పుడు విధానాల్ని ఎన్నికలలో వాగ్దానాలు చేసి ప్రజలను పక్కదారి పట్టించే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింద.వచ్చిన నాటి నుండి దేశంలో మతోన్మాద బీజేపీ దాని మిత్రపక్షాల ఎజెండాను అమలు చేయడానికి రాష్ట్ర రాజధాని తెలంగాణ నిధులను పెట్టుబడుదారి పాలకవర్గాలు ఇచ్చిందం చేయడానికి పరిపాలన కొనసాగిస్తుంది తప్ప ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడానికి పూనుకుంటలేదని ఆరోపించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే వరకు ఎంసిపిఐ(యు) రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను రూపొందించుకోవడానికి ఈ రెండు రోజుల రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు, నల్గొండ జిల్లా కార్యదర్శి వస్కుల సైదుక్క అధ్యక్షతన జరుగుతున్న సమావేశంలో పోలిట్ బ్యూరో సభ్యులు వల్లేపు ఉపేందర్ రెడ్డి,మోర్తాల చందర్ రావు,చంద్ర శేఖర్,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, కుంభం సుకన్య,వనం సుధాకర్,గోనె కుమారస్వామి, సంగతి సాంబయ్య, వరికుప్పల వెంకన్న,అరుణ్ కుమార్,ఏ.హంసారెడ్డి,మాదం తిరుపతి,పెద్దారపు రమేష్, భాష కర్ల బాబు,తాటికొండ రవి,కన్నంవెంకన్న,నజీర్, పానుగంటి నరసయ్య,మంద రవి తదితరులు పాల్గొన్నారు.



# వాళ్లను ఏ కోణంలో విద్యార్థులుగా చూడాలి..

**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆమె పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ.. తాము కూడా ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నామని ఈ సందర్భంగా కంగనా గుర్తుచేశారు. అయితే, 'నీట్' ఆందోళన ముసుగులో విద్యార్థులు మీడియా ముందే వచ్చి బూతులు మాట్లాడటం ఏ రకమైన సంస్కారమని ఆమె తీవ్రంగా మండిపడ్డారు. అసలు అలా మాట్లాడే వారిని ఏ కోణంలో విద్యార్థులుగా చూడాలని ప్రశ్నించిన ఆమె.. వాళ్లు భవిష్యత్తులో సుప్రీంకోర్టులో న్యాయవాదులు అవుతారేమోనంటూ సెటైర్లు వేశారు. చివరకు అమ్మాయిలు కూడా నీచంగా మాట్లాడుతుంటే.. సమాజంలో ఏ తల్లిదండ్రులకైనా విలువ ఎలా ఉంటుందని వ్యాఖ్యానించారు. ఇలా ప్రవర్తించే వాళ్లు భవిష్యత్తులో తీవ్రమైన గడ్డు పరిస్థితులు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తాను 16 ఏళ్ల వయస్సు నుంచే సొంతంగా కెరీర్ బిల్డ్ చేసుకున్నానని, కానీ ఈ విద్యార్థుల్లా ప్రవర్తిస్తే భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని పేర్కొన్నారు. తాను ఇలా మాట్లాడినందుకు సోషల్ మీడియాలో తనను ట్రోల్ చేసినా ఏమాత్రం పర్వాలేదని కంగనా రనౌత్ స్పష్టం చేశారు.

# ఓటును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత



**మేడిపల్లి,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** ఓటును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని పిర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని, ప్రతీ పౌరుడు తమ ఓటును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మాజీ మేయర్ అమర్ సింగ్ అన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 10వ డివిజన్ అంబేద్కర్ నగర్ కమిటీ హాల్లో మంగళవారం రోజున నిర్వహించిన SIR (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల నమోదు పక్కాగా జరగాలని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అలాగే జాబితాలో ఉన్న తప్పుల సవరణ త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, పౌరులు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో సరిచూసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సవరణ కేంద్రానికి విచ్చేసిన స్థానిక ప్రజలకు, యువతకు జాబితాలో పేర్ల నమోదు మరియు మార్పులు చేర్పులపై తగిన సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ గజ్జల కాంతం, డివిజన్ ఇంచార్జ్ బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కోఆప్షన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు అంబేద్కర్ నగర్ కమిటీ ప్రతినిధులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మిగిలింది వారమే.. 'సర్'

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం గడువు సమీపిస్తుండగా ఇంకా స్పందించాల్సిన ఓటర్లు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. మిగిలిపోయిన వారి అడ్రస్‌లను తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు, సిబ్బందితో సహా అందరూ ఎన్యుమరేషన్ పత్రాల స్వీకరణపై దృష్టి కేంద్రీకరించారు. గతంతో పోలిస్తే కొంత పరిస్థితి మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ.. ఇంకా ఎన్యుమరేషన్ పత్రాలు ఇవ్వాల్సిన వారు అధికంగానే ఉండటం గమనర్హం. వాటి అందజేతకు కొందరు నిరాకరిస్తుండగా.. మరికొందరు అందుబాటులో లేకపోవడంతో డిజిటలైజేషన్ ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. ఇంటి అడ్రసులు మారిన వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి సమాచారం అందించి ఎన్యుమరేషన్ పత్రం అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో సర్ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. మొత్తం 5,13,144 మంది ఓటర్లు ఉన్నారు. సర్‌లో భాగంగా వీరందరికి ఎన్యుమరేషన్ పత్రాలను జూన్ 25 వ తేదీన ప్రారంభించారు. ఇప్పటివరకు 3,77,223 మంది ఓటర్లు డిజిటలైజేషన్ పూర్తి చేశారు. వారిలో వాస్తవంగా 2,88,740 మాత్రమే కాగా.. 56.3 శాతం నమోదయింది. అందుబాటులో లేనివారు, మృతులు, అడ్రసలు మారిన వారితో కలిపి 88,483 మంది ఉన్నట్లు తేల్చారు. నియోజకవర్గం పరిధిలో ఇంకా స్పందించాల్సిన ఓటర్లు 1,35,921 మంది ఉన్నారు. సర్ ప్రక్రియ ఆగస్టు 3వ తేదీన ముగుస్తుంది. కేవలం వారం రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇంత తక్కువ వ్యవధిలో లక్షకు పైగా ఓటర్ల ఎన్యుమరేషన్ పత్రాలు తీసుకొని డిజిటలైజేషన్ చేయడం కష్టసాధ్యమనే చెప్పాలి. అందిన ఎన్యుమరేషన్ పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక కేంద్రాల్లో ముమ్మరంగా కసరత్తు కొనసాగుతుంది. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీకి చెందిన వారు ఎన్యుమరేషన్ పత్రాలను తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. తమ స్వస్థలాల్లో ఓటు హక్కు ఉండేలా అక్కడే పత్రాలను ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇటువంటి వారి నుంచి ఆయా ప్రాంతాల్లో ఓటరు నంబర్ తీసుకొని ఆ సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

# ప్రధాని అధ్యక్షతన మంగళ్ మిలన్

**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఇవాళ (మంగళవారం) పార్లమెంట్ లైబ్రరీ భవనంలో ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన్' సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కీలక బిల్లులు, విపక్షాల వ్యూహాన్ని ఎదుర్కోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సభా కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని కూటమి ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. ఈ సమావేశంలో ప్రధానంగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (సవరణ) బిల్లు-2026' ఆమోదంపై వ్యూహాన్ని ఖరారు చేశారు. పేపర్ లీక్‌లు, మాల్‌ప్రాక్టీస్‌లను అరికట్టేందుకు ఈ బిల్లులో కఠిన నిబంధనలు ప్రతిపాదించారు. నేరస్థులకు గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల జరిమానా విధించడంతో పాటు, కేసుల వేగవంతమైన విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించినట్లు సమావేశంలో చర్చించారు. ఇక భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏ) వల్ల కలుగుతున్న ప్రయోజనాలను కూటమి ఎంపీలకు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వివరించారు. భారత ఎగుమతుల పెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణలో ఈ ఒప్పందాలు కీలకంగా మారాయని ఆయన పేర్కొన్నారు. మత్స్యశాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, భవిష్యత్ కార్యాచరణపై కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వివరించారు. మత్స్యకారుల ఆదాయం పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ఎంపీలకు వివరించారు. మరోవైపు, జులై 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసనపై పోలీసు చర్యను ప్రశ్నిస్తూ సభను అడ్డుకుంటున్న విపక్షాలకు తగిన రీతిలో సమాధానం ఇవ్వాలని ఎన్డీయే నిర్ణయించింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్‌తో పాటు ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీలు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ ధర్నాతో సీజేపీ ఉద్యమం పీక్స్ కు

## హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** యువకుడిలా ఆలోచించే శక్తి సీఎం రేవంత్ దగ్గర ఉందని, జెన్ జీ తో పోటీ పడే ఆలోచన ముఖ్యమంత్రిదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మా NSUI, యూత్ కాంగ్రెస్ నేతల్లో 90 శాతం జెన్ జీలే ఉన్నారని చెప్పారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. విద్యార్థుల నిరసన కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. నీట్ అనేది కోట్లాది విద్యార్థులు సమస్య అని, మధ్య తరగతి కుటుంబాలు సైతం ఈ నిరసనలో పాల్గొన్నారని చెప్పారు. కాక్రోచ్ పార్టీ ఆన్‌లైన్ ఉద్యమం మొదలు పెట్టిందని ఆ పార్టీ నినాదాన్ని బలంగా తీసుకెళ్లింది రాహుల్ గాంధీ అని చెప్పారు. నిరసన ఉద్యమం విస్తరించడానికి కారణం కాంగ్రెస్ అని, రాహుల్ గాంధీ ప్రధాని ఇంటి ముందు ధర్నా చేయడంతో ఉద్యమం పీక్స్ కి వెళ్ళిందన్నారు. మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు సన్మానం చేయడం బీజేపీ మనస్తత్వాన్ని తెలియచేసిందన్నారు. తెలంగాణ కేబినెట్ విస్తరణపై స్పందిస్తూ ఎవరు మంత్రులు కావాలో డిసైడ్ చేసేది ఏఐసీసీ అని స్పష్టం చేశారు.

**పీఆర్ స్టంట్‌తో బీఆర్ఎస్ గతి ఏమైంది?:**

తుమ్మిడి హట్టిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరుగుతున్నాయని త్వరలోనే సీఎంతో చర్చలు జరుపుతామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం చర్చలు చేసి ముందుకు వెళ్తామని చెప్పారు. మేం పని చేసుకుంటూ వెళ్తాం ప్రమోషన్ గురించి మేం పట్టించుకోబోమన్నారు. ప్రమోషన్స్, పీఆర్ స్టంట్ చేసుకుంటూ వెళ్లిన బీఆర్ఎస్ పని ఏమైందో చూశామని పనికి మాలిన వాళ్ళు ఏదేదో అంటూనే ఉంటారన్నారు. బెంగుళూరు కంటే ఎక్కువ గ్లోబల్ కెపాబులిటీ సెంటర్స్ హైదరాబాద్ వస్తున్నాయని ఇది మా ప్రభుత్వ విజయం అన్నారు. ఈ ఏడాది 100 కంపెనీలు రావాలని టార్గెట్ పెట్టుకున్నామని అందులో ఇప్పటికి 40 వచ్చాయని చెప్పారు.

**హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు:**

హైడ్రా మంచిదని సాధారణ ప్రజలు చెబుతున్నారని హైడ్రాకు మద్దతుగా ప్రజలు ర్యాలీ తీస్తున్నారన్నారు. హైడ్రా విషయంలో కోర్టు తీర్పును గౌరవిస్తామని, మేం చెప్పాల్సింది కోర్టుకు చెప్తామన్నారు. రాజకీయం కోసమే వ్యతిరేకమైన పిటిషన్లు వేస్తున్నారని హైడ్రాకు వ్యతిరేకంగా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కోర్టు పూర్తి తీర్పు ఇంకా రాలేదని మీడియాలో, సోషల్ మీడియాలో బీఆర్ఎస్ తప్పుడు సమాచారాన్ని తీసుకెళ్తోందన్నారు.

## సంపాదకీయం

# వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవం






వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో) పర్యవేక్షణలో ప్రతి 5,000 ఎకరాల క్లస్టర్‌కు ఒక వేదికగా, రైతులు ఒకచోట చేరి తమ అనుభవాలను పంచుకునేందుకు, నూతన సాంకేతికతలను నేర్చుకునేందుకు వీలుగా గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 2,601 రైతు వేదికలు నిర్మితమయ్యాయి. ఇవి చాలావరకు అరకొర వినియోగంతో లక్ష్యాలను చేరుకోలేకపోయాయి. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రైతు వేదికలకు ప్రాణం పోశాం. వాటిని కేవలం భవనాలుగా కాకుండా, శాస్త్రవేత్తలు--అధికారులు--రైతుల మధ్య ప్రత్యక్ష సంభాషణ వేదికలుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో, 1,600 చోట్ల వీడియో కాన్ఫరెన్సింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి, 'రైతు నేస్తం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఇది గ్రామీణ స్థాయిలో సాంకేతికతను చేరువ చేయడంలో, పాలనా చిత్తశుద్ధిని చాటడంలో మా ప్రభుత్వం వేసిన అత్యంత కీలకమైన అడుగు. 2024 మార్చి 6న ముఖ్యమంత్రి ప్రారంభించిన 'రైతు నేస్తం' కార్యక్రమం, ప్రతి మంగళవారం ఉదయం 10.00 నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తున్నాం. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్ వింగ్ ఆతిథ్యంలో, వ్యవసాయ శాఖ సంచాలకుల కార్యాలయం సహ ఆతిథ్యంలో, సిస్కో వెబెక్స్ ద్వారా ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రతి ఎపిసోడ్‌లో విజయవంతమైన రైతు పొలం నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఆ రైతు అనుభవాలను, ఉత్తమ యాజమాన్య పద్ధతులను తోటి రైతులతో పంచుకునే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. అంతేకాక శాస్త్రవేత్తలు, శాఖాధిపతులు నేరుగా రైతులతో మమేకమై, వారి సందేహాలను ఎలాంటి జాప్యం లేకుండా, రెండు వైపులా సంభాషణ ద్వారా పరిష్కరించే నిజమైన 'ప్రశ్న--సమాధాన' వేదిక. నేడు రైతు నేస్తం 100వ ఎపిసోడ్. ఇప్పటివరకు జరిగిన 99 ఎపిసోడ్‌ల ప్రస్థానం ఈ కార్యక్రమ ప్రభావానికి అద్దం పడుతోంది. మొత్తం రైతుల భాగస్వామ్యం--24,86,581. ఇందులో పురుష రైతులు 19,60,474 కాగా మహిళా రైతులు 5,26,107, పాల్గొన్న అధికారులు 2,43,830. కేవలం రెండేళ్ల వ్యవధిలో, ప్రతివారం క్రమం తప్పకుండా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా పాతిక లక్షల రైతులను నేరుగా చేరుకోగలగడం అసాధారణ విషయం. రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని చేరవేయడం కోసం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వినూత్న మార్గాలను అనుసరించాయి. వాటిని పరిశీలిస్తే తెలంగాణ రైతు వేదికల నమూనా ఎంత ప్రత్యేకమైనదో అర్థమవుతుంది. ప్రపంచంలోనే మొట్టమొదటి వ్యవస్థీకృత వ్యవసాయ విస్తరణ నమూనాగా పేరొందినది అమెరికా కోఆపరేటివ్ ఎక్స్‌టెన్షన్ సిస్టమ్(1914). దీని ద్వారా ల్యాండ్--గ్రాంట్ విశ్వవిద్యాలయాల పరిశోధనలను కౌంటీ స్థాయి ఎక్స్‌టెన్షన్ ఏజెంట్ల ద్వారా రైతులకు చేరవేస్తారు. ఇది ప్రధానంగా ఏజెంట్ల ద్వారా వ్యక్తిగత సందర్శనలపై ఆధారపడిన నెమ్మదైన, వ్యయప్రయాసలతో కూడిన పద్ధతి. శాస్త్రవేత్తతో ప్రత్యక్షంగా, వేలాదిమంది రైతులు ఒకేసారి సంభాషించే వెసులుబాటు లేదు. ప్రైవేట్ రంగం చేపట్టిన అతిపెద్ద డిజిటల్ రైతు కార్యక్రమాల్లో భారత్‌లో ఐటీసీ ఇ--చౌపాల్ (2000) ఒకటి. గ్రామాల్లో ఇంటర్నెట్ కియోస్క్‌లను ఏర్పాటు చేసి, 'సంచాలక్' అనే శిక్షణ పొందిన రైతు ద్వారా మార్కెట్ ధరలు, వాతావరణ సమాచారాన్ని రైతులకు అందించే ఈ నమూనా పది రాష్ట్రాల్లో లక్షలాది రైతులకు చేరింది. అయితే ఇది ప్రధానంగా వ్యాపార ప్రయోజనాల కోసం రూపొందించిన వాణిజ్య నమూనా. సమాచార ప్రసారం ఎక్కువగా ధరలు, కొనుగోళ్లకే పరిమితం, శాస్త్రవేత్తలతో ప్రత్యక్ష చర్చకు అవకాశం తక్కువ. డిజిటల్ గ్రీన్ మోడల్ (వీడియో ఆధారిత విస్తరణ)... అనేక దేశాల్లో అమలవుతున్న ఈ నమూనాలో, విజయవంతమైన రైతుల అనుభవాలను చిత్రీకరించి, ఆ వీడియోలను ఇతర గ్రామాలలో ప్రదర్శిస్తారు. ఇది సంప్రదాయ పద్ధతుల కంటే చాలా చౌకైనది, సమర్థవంతమైనది. ప్రపంచవ్యాప్తంగా లక్షల మంది రైతులను చేరింది. కానీ ఇవి ముందుగా రికార్డు చేసిన వీడియోలు, ప్రత్యక్ష ప్రసారం కాదు కనుక రైతు ప్రశ్నకు తక్షణ సమాధానం ఇచ్చే అవకాశం లేదు. తెలంగాణ రైతు నేస్తం వీటన్నింటి బలాలను మేళవించి, వాటి పరిమితులను అధిగమించింది. ఎందుకంటే ఇది ప్రత్యక్ష, ద్వి--పార్శ్విక సంభాషణ. రికార్డెడ్ వీడియో కాదు, ఏజెంట్ ద్వారా అందే సమాచారమూ కాదు. శాస్త్రవేత్త, రైతు మధ్య ప్రత్యక్షంగా, తక్షణం జరిగే సంభాషణ; పూర్తిగా ఉచిత, ప్రభుత్వ సేవ. అంటే వాణిజ్య ప్రయోజనం ఏ మాత్రం లేకుండా, పూర్తిగా రైతు సంక్షేమమే లక్ష్యంగా నడుస్తున్న వ్యవస్థ. ప్రతి మంగళవారం, ఎలాంటి అంతరాయం లేకుండా 99 వారాలు కొనసాగడం, సంస్థాగత స్థిరత్వానికి నిదర్శనం. ఒకే రాష్ట్రంలో, ఒకే వేదికపై, 1,600 కేంద్రాల ద్వారా ఏకకాలంలో లక్షలాది మంది రైతులను అనుసంధానం చేయడం ప్రపంచంలో మరెక్కడా కనిపించని విషయం. 5.26 లక్షల మంది మహిళా రైతుల భాగస్వామ్యంతో, క్షేత్రస్థాయి సమానత్వానికి ఇది తోడ్పడింది. గ్రామస్థాయిలో సమాచార లోటును పూడ్చి, రైతు ఆలోచనా విధానంలోనే ఒక నిర్మాణాత్మక మార్పుకు నాంది పలికింది. ఇప్పటికే ఉన్న రైతు వేదికల మౌలిక సదుపాయాలను, ప్రభుత్వ శాఖల సమన్వయాన్ని వినియోగించుకుని, అదనపు భారీ వ్యయం లేకుండా లక్షలాది మందిని చేరుకోగలగడం ఈ నమూనా ప్రత్యేకత. రైతు అడిగిన ప్రశ్నకు అదే క్షణంలో శాస్త్రవేత్త నుంచి పరిష్కారం లభించడం వల్ల, పంట నష్టం జరగకముందే సరైన నిర్ణయం తీసుకునే వీలు కలుగుతుంది. ప్రతి వారం సీజన్‌ను బట్టి, పంట దశను బట్టి మారుతూ ఉండే సలహాలు, హెచ్చరికలు నేరుగా రైతులకు అందడం ఈ వేదిక ప్రత్యేకత. ప్రభుత్వ కొత్త పథకాలు, విధానాలు ఎలాంటి జాప్యం లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుకు చేరతాయి. అవసరమైన సందర్భాల్లో వ్యవసాయ శాఖ మంత్రి స్వయంగా ఈ వేదిక ద్వారా రైతులతో మమేకమై, వారి గొంతును నేరుగా వినే సౌలభ్యం ఉంది. ఈ వేదిక సామర్థ్యానికి ఒక చక్కటి ఉదాహరణ ఎరువుల యాప్ ప్రస్థానం. రైతు నేస్తం వేదికగా, ఎరువుల యాప్‌పై రైతుల నుంచి నేరుగా అభిప్రాయాలు, సలహాలు, ఇబ్బందులు సేకరించాం. క్షేత్రస్థాయిలో రైతుల ఆచరణాత్మక సూచనల మేరకు యాప్‌లో అవసరమైన మార్పులు చేపట్టాం. రైతు అనుభవం ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ యాప్, దేశంలోనే ఒక ఆదర్శ నమూనాగా నిలిచి, కేంద్ర ప్రభుత్వం సైతం దీన్ని అమలు చేసింది. రైతు వేదికల విజయానికి ఇది నిదర్శనం. 1,600 రైతు వేదికల్లో అందుబాటులో ఉన్న ఈ సౌకర్యాన్ని త్వరలో మిగతా వాటిలో కూడా వీడియో కాన్ఫరెన్సింగ్ సౌకర్యంతో విస్తరిస్తాం. ప్రతి రైతు వేదికను రైతు నేస్తం పరిధిలోకి తీసుకురావాలన్నదే మా తదుపరి లక్ష్యం. రైతు వేదికలను నిరంతరాయంగా, పూర్తి ఉచితంగా వినియోగించుకుంటున్న ఉదాహరణ దేశంలో మరెక్కడా లేదు. ఇది కేవలం ఒక సాంకేతిక ప్రయోగం కాదు, శాస్త్రవేత్త నుంచి రైతు వరకు, ప్రయోగశాల నుంచి పొలం వరకు జ్ఞానం నేరుగా, వేగంగా, విశ్వసనీయంగా చేరవేసే ఒక సజీవ వ్యవస్థ. రైతు వేదికలు నేడు కేవలం సమావేశ మందిరాలు కావు. అవి తెలంగాణ రైతాంగపు కొత్త గొంతుకలు. 100వ ఎపిసోడ్ చేరువలో ఉన్న ఈ సందర్భంగా, ఈ ప్రస్థానంలో భాగమైన ప్రతి రైతుకు, శాస్త్రవేత్తకు, అధికారికి నా హృదయపూర్వక అభినందనలు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ నమూనాలను మించి, తెలంగాణ సృష్టించిన ఈ ప్రత్యేక వేదిక, రాబోయే రోజుల్లో యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది.




# చట్టసభల్ని స్తంభింపజేశారు

దేశ రాజధానిలో నీట్ లీకేజ్‌కు నిరసనగా జరుగుతున్న ఉద్యమాన్ని ఆషామాషీగా చూసే పరిస్థితి లేదు. ఈ ఉద్యమం దశాబ్దాలుగా నలుగుతున్న ఎన్నో ప్రశ్నలకు బలమైన సమాధానాలు చెప్పింది. జెన్‌జీకి దేశం గురించిన ఆలోచన లేదనే మాటను వమ్ముచేస్తూ.. యువత దండు కదిలింది. అలాగే విద్యార్థి ఉద్యమాలు కనుమరుగైపోయిన తరుణంలో.. వేలు, లక్షల సంఖ్యలో విద్యార్థులు పార్లమెంట్ ముట్టడికి ప్రయత్నించడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. ఏతావాతా ఇకపై రాజకీయ పార్టీల ఆటలు సాగబోవని యువత తేల్చిచెప్పింది. సమస్యలకు ఇలాగే మసిపూసి మారేడుకాయ చేద్దామనుకుంటే.. ఉద్యమాన్ని ఏ స్థాయికైనా తీసుకెళ్తామనే హెచ్చరికలు.. మన పొరుగు దేశాల్లో జరిగిన విద్యార్థులు, యువత ఆందోళనల్ని గుర్తుచేస్తున్నాయి. ఢిల్లీలో యువ జ్వాల రగులుతోంది. లాఠీ దెబ్బలకూ, టియర్ గ్యాస్‌కు భయపడే బ్లడ్ తమది కాదని నినదిస్తోంది. యువత తల్చుకుంటే దేశం భవిత మారుతుందనే నినాదాన్ని నిజం చేస్తామని గర్జిస్తోంది. ఏతావాతా ఆర్థిక సంస్కరణల తర్వాత కెరీర్‌పై ఫోకస్ చేసిన యువతలో.. ఇప్పుడు వెల్లువెత్తిన ఆగ్రహం ఎటు దారితీస్తుందో పార్టీలకు అంతుచిక్కడం లేదు. ఇట్ ఈజ్ రైట్ టు రెబెల్ అనే ఈ వాక్యానికి కాలం చెల్లిందనుకునే వాళ్లకు, ఢిల్లీలో జంతర్ మంతర్ నుంచి భారత పార్లమెంట్ మధ్య ఉన్న వీధులు గట్టి జవాబిచ్చాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతూ యువత గుమిగూడిన సందర్భం అది. ప్రశాంతంగా, ఏ రకమైన ఉద్రిక్తతలు లేకుండా మొదలైన ఈ ఆందోళన పార్లమెంట్ ముట్టడితో కొత్త మలుపు తిరిగింది. విద్యార్థి ఉద్యమానికి ఉన్న శక్తి ఏంటో చాలా కాలం తర్వాత మరోసారి ఎలుగెత్తి చాటింది. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా నిరసనకారుల ఉధృతికి కౌంటర్‌గా పార్లమెంట్ గేట్లు మూసేయాల్సిన సందర్భం.. ఇప్పుడు కనిపించింది. చివరకు పోలీసులు కూడా పార్లమెంట్ లోపలి నుంచి బయట ఉన్న ఉద్యమకారులపై తుపాకులు ఎక్కుపెట్టాల్సి వచ్చిందంటే.. యువత ఆగ్రహం ఏ స్థాయిలో వెల్లువెత్తింతో అర్థం చేసుకోవచ్చు. అలాగని విద్యార్థులు పార్లమెంట్‌కు అలవోకగా ఏమీ చేరుకోలేదు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ దిశగా వేసిన ఒక్కో అడుగుకూ.. నెత్తురు చిందించారు. పోలీసులు లాఠీలతో విరుచుకుపడుతున్నా.. ఇంకా కొట్టండి అంటూ విద్యార్థినులు కూడా ఎదురెళ్లిన దృశ్యాలు చూసి దేశం నివ్వెరపోయింది. యువత ఉద్యమించిన తీరు చూస్తే.. అసలు ఇదంతా నీట్ లీకేజ్‌కు నిరసనేనా.. లేదంటే కొన్నేళ్లుగా వారి గుండెల్లో గూడు కట్టుకున్న అసంతృప్తి.. నివురు గప్పిన నిప్పులా ఉండి.. ఇప్పుడు ఎగసిపడిందా అనే సందేహాలు వచ్చాయి. చివరకు యువత వీరోచిత పోరాటం చూశాక.. రెండోదే నిజమని నిర్ధారణ అయింది. మోడీ పార్లమెంట్ ముందు నిలబడి దేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్ ఎక్కింది అని చెప్పి లోపలికి వెళ్లి వర్షాకాల సమావేశాలు మొదలుపెట్టగానే, విద్యార్థులు, యువత ఉద్యమాల ఎక్స్‌ప్రెస్ ఎక్కి పార్లమెంట్‌కు చేరుకున్నారు. బలమైన వాదనలు, బలమైన వాస్తవాలు ఉంటే పార్లమెంట్ చర్చల్లో తుపానులు అవసరం లేదని ప్రధాని చెప్పి వెళ్లగానే, విద్యార్థి యువత ప్రదర్శన తుపానులా విరుచుకుపడింది. ఏతావాతా ఈ దేశపు యువతలో ఎంత ఆగ్రహం గూడు కట్టుకుందో.. ఎంతటి లోతైన ఆలోచనలు రాజ్యం చేస్తున్నాయో మరోసారి దేశం కళ్లారా చూసింది. ఇక్కడ యువత కేవలం నిరసనలు, ధర్నాలు, ర్యాలీలకే పరిమితం కావడం లేదు. ఒక్కొక్కరు సీబీఎస్ఈ పాఠ్యపుస్తకాలు తీసుకొచ్చి.. ప్రజాస్వామ్యం, ప్రజాభిప్రాయం అంటే ఏమిటో.. రాజకీయ నేతలు ఎలా ఉండాలో.. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఎలా నడుచుకోవాలో.. తమ రాజీనామా డిమాండ్ ఎలా రాజ్యాంగ బద్ధమో.. సంబంధిత పాఠాలు చూపిస్తూ వివరిస్తున్న తీరు.. దేశ ప్రజలందర్నీ ఆలోచనలో పడేసిందనే చెప్పాలి. మొన్నటిదాకా విద్యార్థులే దేశ భవిత అని ఉపన్యాసాలు దంచిన నేతలకు.. ఇప్పుడు యువత ఆగ్రహం చూసి నోట మాట రావడం లేదు. యువత నిలదీస్తే ఎలా ఉంటుందో.. ప్రత్యక్షంగా అనుభవమయ్యేసరికి.. ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో కూడా అర్థం కాక తెల్లముఖాలేస్తున్నారు. అందుకే ఈ సమస్యకు పరిష్కారం ఏంటో కూడా విద్యార్థి లోకమే చెబుతోంది. తమ డిమాండ్ల చిట్టా చదివి వినిపిస్తూ.. వేటికి బేషరతుగా ఒప్పుకోవాలో.. వేటికి చర్చల ద్వారా పరిష్కారాలు వెతకాలో కూడా అరటిపండు ఒలిచి నోట్లో పెడుతోంది. ఇప్పటి యువత ఉద్యమాన్ని చూస్తుంటే.. ఇనుప కండరాలు.. ఉక్కు నరాలు ఉన్న యువత కావాలన్న వివేకానందుడి మాటలు గుర్తొస్తున్నాయి. ఇక యువత మేలుకుంటే ఏం జరుగుతుందో చెప్పటానికి చరిత్రలో చాలా ఉదాహరణలున్నాయి. యువరక్తానికి.. విప్లవానికి, కవిత్వానికి.. గట్టి సంబంధం ఉంది. భగత్‌సింగ్, రాజ్‌గురు, చంద్రశేఖర్ ఆజాద్, రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి, బుద్ధుడు, శంకరాచార్య, స్వామి వివేకానంద వంటివారు యువకులుగా వున్నప్పుడే ప్రపంచంలో ఒక సుస్థిర స్థానం పొందారు. 23 ఏళ్ల యువకుడిగా ఉన్నప్పుడే ఇంక్విలాబ్ జిందాబాద్ అని భగత్‌సింగ్ నినదించాడు. 24 ఏళ్ల వయస్సుకే అల్లూరి సీతారామరాజు వందేమాతరం అని విశాఖ మన్యాన్ని చైతన్యబాటలో కదిలించింది . శీతకాలం కోత పెట్టగ/ కొరడు కట్టీ/ ఆకలేసీ కేకలేశానే అనే కవితతో శ్రీశ్రీ 23 ఏళ్ల వయస్సులోనే జయభేరి మోగించారు. 'పద్దెనిమిదేళ్లు దాటేస్తున్నా.. ఒక్క మంచి కవితా రాయలేదే' అని మహాకవి జాన్‌మిల్టన్ మధనపడ్డాడు. టి.ఎస్. ఇలియట్ తన మాస్టర్ పీస్ అయిన ది వేస్ట్ ల్యాండ్ ను, జాన్‌కీట్స్ తన అత్యుత్తమమైన కవిత్వమంతా పాతికేళ్ల లోపే రాసేశారు. నూనూగు మీసాల నూత్న యవ్వనమున శాలివాహన సప్తశతి నుడివితినని శ్రీనాథుడే స్వయంగా రాసుకున్నాడు. ఇప్పుడు కూడా కదం తొక్కిన యువత ఉడుం పట్టు పట్టి.. పేపర్ లీకేజీలు లేని మరో ప్రపంచానికి.. జవాబుదారీతనంతో కూడిన విద్యావ్యవస్థ ఉండే నవ యుగానికి బాటలు వేసేలా కనిపిస్తోంది. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పరీక్షలపై నమ్మకం దెబ్బతింటే, అది కేవలం ఒక పరీక్షకు సంబంధించిన సమస్యగా మిగలదు. ఆందోళన విద్యార్థుల నుంచి తల్లిదండ్రులకు, అక్కడి నుంచి సమాజానికి విస్తరిస్తుంది. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో కొనసాగుతున్న నిరసనలకు మూల కారణం కూడా అదే. NEET-UG 2026 పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలు, ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలు, పరీక్షల విశ్వసనీయతపై తలెత్తిన సందేహాలు విద్యార్థుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీశాయి. తమ కష్టానికి తగిన న్యాయం జరగాలనే డిమాండ్‌తో విద్యార్థులు, యువత వీధుల్లోకి వచ్చారు. ప్రారంభంలో ఈ ఉద్యమం ఒక పరీక్షకు మాత్రమే పరిమితమైంది. కానీ క్రమంగా ఇది విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, సమాన అవకాశాలపై దేశవ్యాప్త చర్చగా మారింది. ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి. పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండాలి. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా వ్యవస్థను బలోపేతం చేయాలి. ఈ డిమాండ్లతో ప్రారంభమైన నిరసనలు తర్వాత విస్తృత స్థాయిలో ప్రభుత్వ జవాబుదారీతనాన్ని ప్రశ్నించే దిశగా సాగాయి. ఈ నేపథ్యంలో "చలో సంసద్" కార్యక్రమానికి పిలుపునివ్వడంతో వేలాది మంది ఢిల్లీలో నిరసనకు దిగారు. పార్లమెంట్ వైపు కదిలిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. లాఠీచార్జ్, టియర్ గ్యాస్ వినియోగించారని నిరసనకారులు ఆరోపించగా, పోలీసులు మాత్రం చట్టవ్యవస్థను కాపాడేందుకు అవసరమైన చర్యలే తీసుకున్నామని తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో నిజం ఏదో విచారణలు, అధికారిక వివరాలు చెబుతాయి. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తుందిపోలీసు చర్యలే ఇప్పుడు మరో చర్చకు కారణమయ్యాయి. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన ప్రతి పౌరుడి హక్కు. అదే సమయంలో శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. ఈ రెండింటి మధ్య సమతుల్యత పాటించడమే ప్రజాస్వామ్య బలం. చట్టాన్ని అమలు చేయడం అవసరమే. అయితే బలప్రయోగం చివరి ప్రత్యామ్నాయంగా ఉండాలని ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎప్పుడూ చెబుతాయి. దక్షిణాసియాలో ఇటీవలి కాలంలో యువత ఆధ్వర్యంలో ప్రారంభమైన అనేక ఉద్యమాలు ఒక సమస్యతో మొదలై, తర్వాత విస్తృత ప్రజా ఉద్యమాలుగా మారిన ఉదాహరణలు ఉన్నాయి. శ్రీలంకలో ఆర్థిక సంక్షోభంపై ప్రజల అసంతృప్తి భారీ నిరసనలకు దారితీసి రాజకీయ మార్పులకు కారణమైంది. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోటా వ్యవస్థకు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రారంభించిన ఉద్యమం క్రమంగా విస్తృత ప్రభుత్వ వ్యతిరేక నిరసనగా మారింది. నేపాల్‌లో కూడా యువత అవినీతి, సుపరిపాలన, రాజకీయ జవాబుదారీతనం వంటి అంశాలపై పలుమార్లు వీధుల్లోకి వచ్చింది. ప్రతి దేశ పరిస్థితులు వేర్వేరు అయినప్పటికీ, యువత లేవనెత్తిన ఒక సమస్య పెద్ద సామాజిక చర్చగా మారిన సందర్భాలు దక్షిణాసియాలో కనిపించాయి. భారత్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ఈ ఉద్యమం ఎటు దారి తీస్తుందో ఇప్పుడే చెప్పడం కష్టం. ప్రభుత్వం, ఉద్యమకారులు, న్యాయవ్యవస్థ తీసుకునే తదుపరి నిర్ణయాలపై దీని భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఒక పరీక్షపై ప్రారంభమైన అసంతృప్తి, ఇప్పుడు విద్యా వ్యవస్థపై యువతకు ఉన్న విశ్వాసం, పారదర్శకత, జవాబుదారీతనం గురించి దేశవ్యాప్త చర్చకు దారితీసింది. విద్యార్థులు కోరుకుంటున్నది కేవలం ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడమే కాదు. తమ కష్టం, ప్రతిభ, భవిష్యత్తు న్యాయంగా అంచనా వేయబడే వ్యవస్థ. ఆ విశ్వాసాన్ని పునరుద్ధరించడం ఏ ప్రభుత్వానికైనా అత్యంత పెద్ద బాధ్యత. అదే సమయంలో, ఆ విశ్వాసాన్ని తిరిగి తీసుకురావడానికి సంభాషణ, పారదర్శకత, జవాబుదారీతనమే శాశ్వత పరిష్కారం. లాఠీలు ఒక గుంపును చెదరగొట్టగలవు. కానీ యువత మనసులోని ప్రశ్నలను మాత్రం సమాధానాలే శాంతింపజేయగలవు.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ఉన్నత విద్యలో 'ప్రైవేటు' హవా

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో అధికులు ప్రైవేటు విద్యా సంస్థల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రానికి దూరవిద్య ప్రవేశాల్లో విశేషణ ఆదరణ ఉంది. పీజీ డిప్లొమా కోర్సుల్లో మహిళలే అధికంగా చేరుతున్నారు. కేంద్ర విద్యా శాఖ ఇటీవల విడుదల చేసిన ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్ హెచ్ఈ) 2023-24 నివేదికలో ఆసక్తికరమైన గణాంకాలు వెల్లడయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత విద్యలో మొత్తం 11 లక్షల మంది విద్యార్థులు చేరగా, అందులో ఏకంగా 9.30 లక్షల మంది ప్రైవేటు కాలేజీల్లోనే ప్రవేశాలు పొందారు. ఇక ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేరిన విద్యార్థుల సంఖ్య కేవలం 1.70 లక్షలు మాత్రమే కావడం గమనార్హం. అనగా రాష్ట్రంలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారిలో దాదాపు 80 శాతానికి పైగా విద్యార్థులు ప్రైవేటు విద్యాసంస్థల్నే ఎంచుకున్నారు.

**వారి ఆధిపత్యమే కారణం..**

రాష్ట్రవ్యాప్తంగా 1780 కాలేజీల్లో 11 లక్షల మంది చదువుతుండగా.. అందులో ప్రైవేటు కాలేజీలు(మొత్తం) 9,30,057 మంది కాగా అందులో అన్ ఎయిడెడ్‌లో 8,85,372 మంది, ఎయిడెడ్‌లో 44,685 మంది ఉన్నారు. కాగా ప్రభుత్వ కాలేజీల నుంచి 1,70,026 మంది చదువుతున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో సీట్ల సంఖ్య పరిమితంగా ఉండటం, సాంకేతిక, వృత్తి విద్యా కోర్సుల్లో ప్రైవేటు యాజమాన్యాల ఆధిపత్యం పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని విద్యా వేత్తలు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, డిగ్రీ కాలేజీల్లో మెజారిటీ సంస్థలు ప్రైవేటుకు చెందినవే కావడం ఈ వ్యత్యాసానికి అద్దం పడుతోంది.

**దూరవిద్య ప్రవేశాల్లో విశేష ఆదరణ..**

దేశవ్యాప్తంగా ఉన్నత విద్యలో దూర విద్య విధానం ద్వారా అభ్యసిస్తున్న విద్యార్థుల తాజా నివేదిక ప్రకారం.. తెలంగాణ అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. రాష్ట్రంలో ఏకంగా 1,74,546 మంది విద్యార్థులు దూరవిద్య ద్వారా వివిధ కోర్సుల్లో చేరారు. వివిధ రాష్ట్రాల డేటాను పరిశీలిస్తే, తెలంగాణలో పురుషులతో పాటు మహిళలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలో నమోదు చేసుకున్న మొత్తం విద్యార్థులలో 90,833 మంది పురుషులుకాగా, 83,713 మంది మహిళలు ఉన్నారు. పీజీ డిప్లొమా కోర్సులలో చేరిన మొత్తం 7,897 మంది విద్యార్థులలో ఏకంగా 3,915 మంది మహిళలే కావడం విశేషం. రాష్ట్రంలో డిప్లొమా కోర్సుల్లో 1,572 మంది (775 పురుషులు, 797 మహిళలు), సర్టిఫికెట్ కోర్సుల్లో 848 మంది (301 పురుషులు, 547 మహిళలు) నమోదు చేసుకున్నారు. మహారాష్ట్ర 5,74,505 మంది విద్యార్థులతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. తర్వాత తమిళనాడు 3,56,420 మందితో రెండవ స్థానంలో ఉంది. రాజస్థాన్: 1,84,156 మంది విద్యార్థులతో మూడవ స్థానంలో ఉండగా, తెలంగాణ 1,74,546 తర్వాతి స్థానంలో నిలిచి దక్షిణ భారతదేశంలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకుంది.



# 16 మంది మావోయిస్టుల లొంగుబాటు

**రాంచీ :** ఝార్ఖండ్ రాజధాని రాంచీలో మావోయిస్టుల నెట్‌వర్క్‌కు తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. హింసామార్గాన్ని వీడి ప్రజాస్వామ్య వ్యవస్థ పై నమ్మకంతో ఏకంగా 16 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాలకు ఆకర్షితులై, భద్రతా బలగాలు చేపట్టిన నిరంతర నిఘా, వ్యూహాత్మక చర్యల ఫలితంగానే వీరు జనజీవన స్రవంతి లోకి వచ్చినట్లు పోలీసులు స్పష్టం చేశారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు అత్యంత కీలక నేతలు కాగా, వీరిపై ప్రభుత్వం రూ. 39 లక్షల మొత్తంలో భారీ రివార్డులను ప్రకటించి ఉంది. తీవ్రమైన విచారణలు, అనేక హింసాత్మక ఘటనలలో వీరికి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లొంగిపోయిన మావోయిస్టులందరికీ తగిన పునరావాస సదుపాయాలు, ఆర్థిక సహాయం అందిస్తామని, శాంతియుత జీవనం సాగించేందుకు పూర్తి సహకారం ఉంటామని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఐజీ (ఆపరేషన్స్), జార్ఖండ్ పోలీస్ నరేంద్ర కుమార్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎనిమిది మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో రూ. 15 లక్షల రివార్డు ఉన్న ఒక కేంద్ర కమిటీ సభ్యుడు కూడా ఉన్నాడు. మిగిలిన వారిలో ముగ్గురు జోనల్ కమిటీ సభ్యులు, ముగ్గురు సబ్-జోనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. ఇది జార్ఖండ్ పోలీసులకు ఒక చారిత్రాత్మక దినం, గొప్ప విజయం. మావోయిస్టు కార్యకలాపాలు దాదాపుగా నిర్మూలించబడ్డాయి. కొందరు ఇంకా చురుకుగా ఉన్నారు. వారిపై నిరంతర ఆపరేషన్లు కొనసాగుతున్నాయి. వారు వీలైనంత త్వరగా లొంగిపోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. లేకపోతే, ఆపరేషన్ల సమయంలో వారిని హతమార్చడం జరుగుతుంది." అని మీడియాకు చెప్పుకొచ్చారు.

# ఏళ్ల తరబడి తిష్ట

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

హైదరాబాద్‌లోని జలసౌధ.. రాష్ట్ర సాగునీటి శాఖకు గుండె వంటి కార్యాలయం. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులు, నిధుల కేటాయింపులు, పరిపాలనా నిర్ణయాలు, సర్వీస్ వ్యవహారాలకు సంబంధించిన కీలక ఫైళ్లు అన్నీ ఇక్కడి నుంచే కదులుతాయి. అయితే.. ఇక్కడ పనిచేస్తున్న కొందరు అధికారులు మాత్రం ఏళ్ల తరబడి ఒకే విభాగంలో కొనసాగుతుండటం శాఖలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. సాధారణంగా ప్రభుత్వ సేవా నిబంధనల ప్రకారం ఒకే స్థానంలో నిరంతరం కొనసాగకుండా నిర్దిష్ట వ్యవధి తర్వాత బదిలీలు చేయడం పరిపాలనా వ్యవస్థలో భాగం. దీంతో అధికారుల్లో పారదర్శకత పెరుగుతుంది. కానీ.. జలసౌధలోని ఈఎన్సీ (అడ్మిన్) విభాగంలో మాత్రం ఈ నిబంధనలు అందరికీ ఒకేలా అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**డిప్యూటీ ఈఎన్సీ నుంచి ఏఈఈ వరకు..**

శాఖలోని డిప్యూటీ ఇంజినీర్-ఇన్-చీఫ్ స్థాయి అధికారుల నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల వరకు పలువురు అధికారులు చాలా ఏళ్లుగా జలసౌధ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోనే కొనసాగుతున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు. కొందరు మధ్యలో సెక్షన్ మారినా, కార్యాలయం మాత్రం మారలేదని అంటున్నారు. కొంత మంది అధికారులు పదేళ్లకు పైబడి కొనసాగుతుండగా.. మరికొందరేమో ఆరేళ్లకు పైబడిన అధికారులు ఉన్నారు. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రధానంగా డిప్యూటీ ఈఈలు, ఏఈఈలు 20 మందికి పైగా లాంగ్ స్టాండింగ్‌లో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం ఈఎన్సీ వరకే బదిలీ చేయడం.. లేదంటే ఈఎన్సీ రిటైర్‌మెంట్ అయితే ఆయన స్థానంలో కొత్త వారిని నియమించడం వరకే తంతు జరుగుతున్నట్లు సమాచారం. అంతేకానీ.. కీలక అధికారులను మాత్రం టచ్ కూడా చేయడం లేదన్న ప్రచారం జరుగుతున్నది.

**సర్వీస్ వ్యవహారాలన్నీ వీరి చేతుల్లోనే..**

సాధారణంగా అడ్మిన్ విభాగంలో పనిచేస్తున్న వారే ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, పోస్టింగులు, సీనియారిటీ జాబితాలు, డిప్యూటేషన్లు, క్రమశిక్షణా చర్యలు, కోర్టు కేసులు, సర్వీస్ రికార్డులు వంటి అత్యంత కీలకమైన సర్వీస్ రిలేటెడ్ మ్యాటర్స్ ను పర్యవేక్షిస్తుంటారు. దీంతో ఎవరు ఎక్కడ పనిచేయాలి? ఎవరికి ఏ పోస్టింగ్ ఇవ్వాలి? ఎవరి ఫైల్ ఎప్పుడు కదలాలి? వంటి అంశాలు వీరి చేతుల్లోనే ఉంటాయి. ఏళ్లకేళ్లుగా వీరు అక్కడే ఉంటుండడంతో వీరు అనుకున్న వారికే పదోన్నతులు, ట్రాన్స్ ఫర్లు జరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా.. ఏటా ఉద్యోగులకు ఇచ్చే ఇంక్రిమెంట్లలోనూ వీరిదే కీలక పాత్ర. అందుకే.. వీరి బాధ్యతలు ఆ స్థాయిలో ఉండటంతో పై స్థాయి అధికారులను మచ్చిక చేసుకుని అక్కడే కొనసాగుతున్నారన్న ప్రచారం జరుగుతున్నది.

**'అడ్మిన్' పోస్టులపైనే ఆసక్తి..**

శాఖలో కొందరు అధికారులు తమకు అనుకూలంగా ఉండే విధంగా పరిపాలనా విధానాలను రూపొందించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీలకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చినప్పుడు మినహాయింపులు, ప్రత్యేక పరిస్థితులు, పరిపాలనా అవసరాలు వంటి కారణాలను చూపిస్తూ అదే స్థానంలో కొనసాగుతున్నారని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక జిల్లాలో పనిచేస్తున్న అధికారులు మాత్రం నిర్దిష్ట కాలపరిమితి పూర్తికాగానే తప్పనిసరిగా బదిలీ అవుతుండగా, జలసౌధలో పనిచేసేవారికి మాత్రం అవే నిబంధనలు ఎందుకు వర్తించడం లేదని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఫీల్డ్ పోస్టింగులతో పోలిస్తే ప్రధాన కార్యాలయంలో పనిచేసే అధికారులకు అనేక పరిపాలనా ప్రయోజనాలు ఉంటాయని శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఉన్నతాధికారులతో ప్రత్యక్ష సంబంధాలు, కీలక ఫైళ్ల నిర్వహణ, ప్రభుత్వ స్థాయి సమావేశాల్లో భాగస్వామ్యం, విధాన నిర్ణయాల్లో పరోక్ష పాత్ర వంటి అంశాలు ఈ పోస్టులను మరింత కీలకంగా మారుస్తున్నాయి. అందుకే ఒకసారి అడ్మినిస్ట్రేషన్ విభాగంలోకి వచ్చిన అధికారులు అక్కడి నుంచి బయటకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# ప్రవాసల బతుకులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రెక్కలుముక్కలు చేసుకునైనా కుటుంబం కోసం నాలుగు రాళ్లు వెనుకేసుకొద్దామని దేశాలు దాటి వెళుతున్న మనోళ్ల బతుకులు విదేశాల్లోనే తెల్లారుతున్నాయి. అప్పులు చేసి మరీ కన్నవారిని, భార్యాపిల్లలను వదిలి సముద్రాలు దాటి వెళ్లిన మన వారి బతుకులు అక్కడే ఆగమవుతున్నాయి. విదేశాల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్న మన వారి సంఖ్య పెరుగుతోంది. గడిచిన మూడేళ్లలో (2023--2025) విదేశాల్లో నివసిస్తున్న భారతీయ పౌరుల మరణాలపై కేంద్ర ప్రభుత్వం తాజాగా లోక్ సభలో వెల్లడించిన గణాంకాలు షాక్‌కు గురి చేస్తున్నాయి. ఈ మూడేళ్ల కాలంలో విదేశాల్లో 1,900 మందికి పైగా భారతీయులు ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. ఇందులో 70 శాతానికి పైగా మరణాలు గల్ఫ్ దేశాల్లోనే సంభవించినట్లు పేర్కొంది.

**ఏ దేశంలో ఎంత మంది?:**

కాంగ్రెస్ ఎంపీలు సత్పాల్ బ్రహ్మాచారి, జై ప్రకాశ్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్రం అందించిన వివరాల ప్రకారం.. మూడేళ్లలో మొత్తం 1,340 మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. యూఏఈ (ఖాాజు)లో 511, సౌదీ అరేబియాలో 354, కువైట్‌లో 162, ఒమన్‌లో 146, బహ్రెయిన్‌లో 101, ఖతార్‌లో 66 మంది బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపింది.

**ఇతర దేశాల్లో..**

గల్ఫ్ తర్వాత మలేషియాలో అత్యధికంగా 131 ఆత్మహత్య కేసులు నమోదైనట్లు కేంద్రం ప్రకటించింది. అమెరికాలో 62 మంది ఆత్మహత్య చేసుకోగా.. ఇటలీ, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) లలో ఒక్కో దేశంలో 30కి పైగా కేసులు నమోదయ్యాయని వెల్లడించింది. గతంతో పోలిస్తే విదేశాల్లో భారతీయుల ఆత్మహత్యల సగటు సంఖ్య పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అంతకుముందు 2014 నుండి 2022 మధ్య (ఎనిమిదేళ్లలో) 4,005 ఆత్మహత్యలు జరిగినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ఇక పని ప్రదేశాల్లో జరిగిన ప్రమాదాల వల్ల సంభవించిన మరణాల్లో సౌదీ అరేబియా మొదటి స్థానంలో ఉందని కేంద్రం పేర్కొంది. ఈ దేశంలో 182 పని చేసే చోట ప్రమాదం వల్ల మరణించగా యూఏఈలో 128, అమెరికా 46, కెనడా 40, సింగపూర్ 32, మాల్దీవులు 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఆత్మహత్యలకు నిర్దిష్టమైన కారణాలను ప్రభుత్వం పేర్కొననప్పటికీ, విదేశాల్లో పనిచేసే కార్మికుల రక్షణ కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా 'ఎమిగ్రేషన్ చెక్ రిక్వైర్డ్' కేటగిరీ కార్మికులకు 'ప్రవాసి భారతీయ బీమా యోజన' కింద రూ. 10 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు.

# విదేశీయులే లక్ష్యంగా...

## కోట్ల రూపాయల సైబర్ మోసం.. ప్రధాన నిందితుడి అరెస్ట్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ కేంద్రంగా నడిచిన అంతర్జాతీయ ఫేక్ కాల్ సెంటర్ స్కామ్‌లో కీలక నిందితుడిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారి వికాస్ కుమార్ నిమార్ అలియాస్ మిస్టీ.. అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల సైబర్ మోసానికి పాల్పడ్డాడు. దీంతో వికాస్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫేక్ కాల్ సెంటర్‌కు సంబంధించి మాదాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇంటర్‌పోల్ ద్వారా అమెరికా ఎంబసీ అందించిన సమాచారంతో సీబీఐ గతంలోనే కేసు నమోదు చేసింది. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్, విశాఖపట్నం, లఖ్‌నవూతో పాటు పలు నగరాల్లో నకిలీ కాల్ సెంటర్లను వికాస్ నిర్వహించాడు. ఈ ముఠా.. టెక్నికల్ సపోర్ట్ పేరుతో విదేశీయులను నమ్మించి భారీ మొత్తంలో డబ్బు కాజేసింది. ప్రభుత్వ సంస్థలు, ప్రముఖ ప్రైవేట్ కంపెనీల అధికారులమంటూ బాధితులకు ఫోన్ కాల్స్ చేసి నిందితుడు బెదిరింపులకు పాల్పడినట్లు విచారణలో బయటపడింది. వికాస్.. కంప్యూటర్ వైరస్‌లు, బ్యాంక్ ఖాతా సమస్యలు, సెక్యూరిటీ అలర్ట్‌ల పేరుతో అమెరికన్లను భయపెట్టి డబ్బు వసూలు చేశాడని.. గిఫ్ట్ కార్డులు, డిజిటల్ పేమెంట్ల రూపంలోనూ బాధితుల నుంచి నగదు సేకరించినట్లు దర్యాప్తులో తేలింది. సేకరించిన డబ్బును క్రిప్టోకరెన్సీగా మార్చి ఆధారాలు లేకుండా ప్రయత్నించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. క్రిప్టో ఆస్తులను ఎక్స్ఛేంజ్‌లు, హవాలా తరహా నగదు సెటిల్‌మెంట్ నెట్‌వర్క్‌లు, బ్యాంకింగ్ మార్గాల ద్వారా భారత కరెన్సీగా మార్చినట్లు విచారణలో బయటపడింది. వీసీ సొల్యూషన్స్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి మోసపూరిత డబ్బును చట్టబద్ధ ఆదాయంగా చూపించే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. వీసీ సొల్యూషన్స్ బ్యాంక్ ఖాతాల్లో భారీ నగదు డిపాజిట్లు, అనుమానాస్పద క్రెడిట్ లావాదేవీలను గుర్తించారు. కాల్ సెంటర్ ద్వారానే ఆదాయం వచ్చినట్లు విచారణలో నిమార్ అంగీకరించినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. అయితే ఈ డబ్బును ఆదాయపు పన్ను రిటర్న్‌లో కిరాణా వ్యాపారం, ఇతర వ్యాపారాల ఆదాయంగా వికాస్ చూపించాడని తెలిపారు. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో మరికొందరి పాత్ర, నిధుల ప్రవాహం, క్రిప్టో లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# సనాతన ధర్మాన్ని మార్చలేరు

**సూర్యాపేట,ఫ్లాష్ ఇండియా :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సూర్యాపేట జిల్లా హుజురాబాద్ లో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డుబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందని అన్నారు. దక్షిణ తెలంగాణ బీజేపీ బలోపేతం కావడం శుభపరిణామం అని చెప్పారు. విద్యావంతులు పార్టీలో చేరడం సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు మార్పుకోరుకుంటున్నారని అన్నారు. అంతేకాకుండా ప్రపంచంలో చాలా దేశాలు ముస్లిం, క్రిస్టియన్ దేశాలుగా మారాయని కానీ సనాతన ధర్మాన్ని ఎవరూ ఏం చేయలేకపోయారన్నారు. దేశాన్ని విడగొట్టే కుట్రలు జరుగుతున్నాయని, సనాతన ధర్మాన్ని ఎవరూ మార్చలేరని వ్యాఖ్యానించారు. యువత పేరుతో దేశాన్ని విడగొట్టే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. అమెరికా, దుబాయ్ లాంటి దేశాల నుండి ఫండింగ్ జరుగుతోందని అన్నారు. దేశం ఐక్యత కాపాడాలంటే ప్రజలు అంతా కలిసి ఉండాలని చెప్పారు. సర్ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దేశ భద్రతకు ముప్పు వాటిల్లితే సహించం అని చెప్పారు. సర్ ప్రక్రియ ప్రతి పదేళ్లకు ఒకసారి జరుగుతుందని, దానిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

# లాఠీ-ఛార్జ్ పై సుప్రీం ఆగ్రహం





**న్యూ ఢిల్లీ :** పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు ఇవాళ (మంగళవారం) కీలక ఆదేశాలు జారీ చేసింది. 18 ఏళ్లలోపు మైనర్లు, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై దేశవ్యాప్తంగా సాగిన నిరసనల సమయంలో, విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనలకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా, అత్యున్నత న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేసింది.

**స్వతంత్ర విచారణ జరగాల్సిందే**

భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిర్దోషులపై అతిక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు, తన పని తాను చేసుకుపోతుంది' అని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనలపై 'స్వతంత్ర విచారణ' జరగాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. 'బాధ్యులను తేల్చనప్పుడు, విచారణకు అర్థమే లేదు' అని CJI వ్యాఖ్యానించారు.

**శాంతియుత నిరసన రాజ్యాంగబద్ధమైన హక్కు**

ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలుపడం పౌరుల ప్రాథమిక హక్కు అని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలపై న్యాయం కోరుతూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో, వారిపై బలాన్ని ప్రయోగించడం సరికాదని కోర్టు భావించింది.

**పోలీసుల రక్షణపైనా ప్రశ్నలు**

ఈ ఆందోళనల సమయంలో విద్యార్థులపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, గాయపడిన పోలీసుల రక్షణ, వారి భద్రతా పరికరాల గురించి కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కోర్టు పేర్కొంది. శాంతిభద్రతల నిర్వహణ అనేది ద్వితీయ ప్రాధాన్యం కాకూడదని స్పష్టం చేసింది.

**ఏకీకృత ప్రొటోకాల్ అవసరం**

దేశవ్యాప్తంగా వివిధ సందర్భాల్లో జరుగుతున్న నిరసనల సమయంలో శాంతిభద్రతల నిర్వహణకు, అల్లర్లను అదుపు చేయడానికి సంబంధించి ఒకే విధమైన (ఏకీకృత) ప్రొటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వేర్వేరుగా ప్రవర్తించడం సరికాదని, నిర్దిష్ట నియమావళి ఉండాలని సూచించింది.



# రాజకీయ నైతికతకు ప్రతీక జైపాల్ రెడ్డి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాజకీయాల్లో నైతికతకు ప్రతీక కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి వర్ధంతిని పురస్కరించేకొని ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థి నాయకునిగా ప్రస్థానం ప్రారంభించిన జైపాల్ రెడ్డి.. తన తుదిశ్వాస వరకు విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని సీఎం పేర్కొన్నారు. తన విషయ పరిజ్ఞానం, వాగ్ధాటితో ఇటు ప్రజల్లో అటు పార్లమెంట్‌లో తనదైన ముద్ర వేసిన ఘనత జైపాల్ రెడ్డిదని సీఎం తెలిపారు. ఆయన ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తుందని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, కాంగ్రెస్ నేతలు రోహిణ్ రెడ్డి, తుమ్మల యుగంధర్ పాల్గొన్నారు.

# వ్యవసాయ సాంకేతికత వైపు ప్రభుత్వం అడుగులు








**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వ్యవసాయ సాంకేతికత వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం, హైదరాబాదు నుంచి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల్లోని మండలాల రైతు వేదికల ద్వారా అధికారులు, రైతులతో రైతు నేస్తం 100వ ఎపిసోడ్ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని సులభంగా, లాభసాటిగా మార్చేందుకు సాంకేతికతను వ్యవసాయ రంగానికి జోడించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. ఉద్యానవన పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. ఆయిల్ పామ్ పంటల సాగు వల్ల అధిక లాభాలు వస్తా-యని వివరించారు. నేల స్వభావం, నీటి లభ్యత, దిగుబడి, మార్కెటింగ్ సౌకర్యం, తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటలు సాగు చేయాలన్నారు. ప్రతి రైతు పంట మార్పిడి విధానాలు పాటించాలని పేర్కొన్నారు. మోతాదుకు మించి ఎరువులను వాడరాదని తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ప్రపంచ సమాచారాన్ని మొత్తం రైతు ముంగిట్లో ఉంచుతున్నామన్నారు. ముమ్ముందు రైతులు పెద్ద సంఖ్యలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా రైతుల్లో పంటలకు సంబంధించి అనేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మండల స్థాయి వ్యవసాయ అధికారులంతా తప్పనిసరి ప్రతిరోజు రైతుల మధ్య ఉండాలని చెప్పారు. మంత్రితో నేరుగా ఆయా మండలాల నుంచి రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన పలువురు రైతులు మాట్లాడుతూ.. వారు అవలంబించిన పంట మార్పిడి విధానాలు, పొందిన లబ్ధి వివరాలు పంచుకున్నారు. అలాగే పలువురు ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని దేవరుప్పుల మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ క్రమంలో రైతులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ సంబంధ అనేక అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కలుగుతుందని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ఉత్తమ రైతులు, వ్యవసాయ అధికారులను అభినందించి, వారికి జ్ఞాపికలను, అదే విధంగా రైతులకు విత్తనాల ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మారుతి సుజుకి నూతన బ్రెజ్జా టర్బో బూస్టర్‌జెట్ ఆవిష్కరణ




**ఎల్ బి నగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** దేశంలోని ప్రముఖ మారుతి సుజుకి డీలర్ వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ యువత కోసం మరింత శక్తివంతమైన డ్రైవింగ్ అనుభూతిని అందించే నూతన బ్రెజ్జా టర్బో బూస్టర్‌జెట్‌ను ఘనంగా ఆవిష్కరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ నటి అనన్య నాగళ్ల, వరుణ్ మోటార్స్ కమర్షియ-ల్ బిజినెస్ హెడ్ శ్రీ సురేష్ బాబు, మా-రుతి సుజుకి ఇండియా లిమిటెడ్ ప్రాంతీయ మేనేజర్ జి. పార్థిబన్ హాజరై, బేగంపేట షోరూమ్‌లో నూతన బ్రెజ్జాను ఆవిష్కరించారు. ఈ వేడుకకు గౌరవ అతిథులుగా వరుణ్ మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.ఆర్.సి. రాజు, చీఫ్ జనరల్ మే-నేజర్ ఎస్. కౌసిక్, జనరల్ మేనేజర్ కె. కృష్ణ కుమార్తో పాటు సంస్థ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారతదేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న కాంపాక్ట్ ఎస్‌యూవీ అయిన నూతన బ్రెజ్జా నేటి యువత అభిరుచులు, జీవనశైలిని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడింది. "స్పాంటేనియస్ ప్లే" అనే కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకున్న ఈ టర్బో బూస్టర్‌జెట్ వేరియంట్ ధైర్యం, ఉత్సాహం, స్టైలిష్ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా రూపొందించబడింది. ఈ నూతన బ్రెజ్జా టర్బో బూస్టర్‌జెట్ ప్రారంభ పరిచయ ధర రూ. 7.39 లక్షల నుంచి అందుబాటులో ఉంది. నూతన బ్రెజ్జా ప్రధాన భద్రతా మరియు డిజైన్ ప్రత్యేకతలు యువతను ఆకట్టుకునే ఆధునిక డిజైన్ నూతన బ్రెజ్జా తన ప్రత్యేకమైన ఎస్‌యూవీ రూపాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకుంది. కొత్త స్మోక్ క్రోమ్ గ్రిల్, మెటాలిక్ గ్రే బుల్ బార్, స్కిడ్ ప్లేట్, అలాగే కొత్త ప్రెసిషన్ కట్ అలాయ్ వీల్స్ వాహనానికి మరింత స్టైలిష్ మరియు శక్తివంతమైన రూపాన్ని అందిస్తున్నాయి. అదనంగా "టర్బో బూస్టర్‌జెట్" ప్రత్యేక బ్యాడ్జింగ్ వాహనానికి స్పోర్టీ లుక్‌ను మరింత పెంచుతుంది. అత్యాధునిక భద్రతా ఫీచర్లు నూతన బ్రెజ్జా 5 స్టార్ భారత్ ఎన్‌సీఏపీ భద్రతా ప్రమాణాలను లక్ష్యంగా పెట్టుకుని రూపొందించబడింది.

**ఇందులో:**

బ్లైండ్ స్పాట్ వార్నింగ్ లేన్ చేంజ్ అలర్ట్ రియర్ క్రాస్ ట్రాఫిక్ అలర్ట్ టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ (టీపీఎంఎస్) ఎమర్జెన్సీ స్టాప్ సిగ్నల్ ఎగ్జిట్ సపోర్ట్ వార్నింగ్ వంటి ఆధునిక భద్రతా సదుపాయాలు ఉన్నాయి. అలాగే కొత్త 360 డిగ్రీ వ్యూ కెమెరాలో మూడు కొత్త వ్యూ మోడ్‌లు ఉండటంతో డ్రైవర్‌కు వాహనం చుట్టూ స్పష్టమైన దృశ్యం లభిస్తుంది. ఫీచర్లతో నిండిన ప్రీమియం అనుభవం నూతన బ్రెజ్జాలో 25.65 సెం.మీ. (10.1 అంగుళాల) స్మార్ట్‌ప్లే ప్రో ఎక్స్ టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ అందుబాటులో ఉంది.

**ఇందులో:**

అంతర్నిర్మిత ఇంటర్నెట్ కనెక్టివిటీ
35కు పైగా యాప్‌లు
ఓటీఏ (రూూూ) అప్‌డేట్స్
అలెక్సా వాయిస్ అసిస్టెంట్
వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో
వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే
సౌకర్యాలు ఉన్నాయి.

**అదనంగా:**

కొత్త ప్రీమియం స్పీకర్లు ఆర్కమిస్ ఆధారిత సరౌండ్ సౌండ్ సిస్టమ్ 64 రంగుల కస్టమైజ్ చేయగల అంబియెంట్ లైటింగ్ వంటి సదుపాయాలు ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా, ఆహ్లాదకరంగా మారు-స్తాయి. ప్రత్యేక యాక్సెసరీ ప్యాకేజీలుటర్బో ప్యాకేజ్ ఎరుపు రంగు ప్రత్యేక అలంకరణలు, సీ-పిల్లర్ టర్బో బ్యాడ్జింగ్‌తో బ్రెజ్జాకు మరింత స్పోర్టీ రూపాన్ని అందిస్తుంది. టెర్రాస్కేప్ ప్యాకేజ్ సాహస-యాత్రలను ఇష్టపడే వినియోగదారుల కోసం రూపొందించిన ఈ ప్యాకేజ్‌లో గోధుమ, వెండి రంగు బాహ్య అలంకరణలు ఉండి ఎస్‌యూవీకి మరింత రగ్గడ్ లుక్‌ను అందిస్తాయి. మెట్రోస్కేప్ ప్యాకేజ్ పట్టణ జీవనశైలిని ఇష్టపడే వినియోగదారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ ప్యాకేజ్ స్టైలిష్ డిజైన్ అంశాలతో బ్రెజ్జాకు ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తుంది. ధరలు నూతన బ్రెజ్జా టర్బో 1.0 లీటర్ వేరియంట్ ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర రూ. 7.39 లక్షల నుంచి. 1.5 లీటర్ ఇంజిన్ వేరియంట్ ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర రూ. 8.29 లక్షల నుంచి. ఈ అనువాదాన్ని అవసరమైతే పత్రికా ప్రకటన (ప్రెస్ రిలీజ్) శైలిలో లేదా టీవీ/డిజిటల్ న్యూస్ స్క్రిప్ట్ రూపంలో కూడా సిద్ధం చేయగలను.

# అకాడమిక్ ఫ్రేమ్‌వర్క్‌ను తప్పనిసరిగా పాటించాలి





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ముందుగా ఉపాధ్యాయులు ప్రతి పాఠ్యాంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ముందస్తుగా సన్నద్ధమై తరగతి గదిలోకి రావాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. ఉపాధ్యాయులు ప్రతి అంశంపై పూర్తి అవగాహనతో బోధిస్తేనే విద్యార్థుల్లో నేర్చుకునే సామర్థ్యం పెరిగి, ఉత్తమ ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. మంగళవారం, జిల్లాలోని దేవరుప్పుల మండల పరిధిలో గల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా 8వ, 10వ తరగతి గదులను సందర్శించి, ఉపాధ్యాయుల బోధన విధానాన్ని, విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి అవగాహనను పరీక్షించడంతో పాటు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం సాంఘీక శాస్త్రం పాఠ్యాంశంలోని ఆర్కిటిక్, అంటార్కిటిక్ వలయాల గురించి విద్యార్థులకు సులభమైన శైలిలో వివరించారు. క్లిష్టమైన అంశాలను కూడా సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాల్సిన అవసరాన్ని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠ్యాంశాలను కేవలం చదివించడం కాకుండా, విద్యార్థులతో పదేపదే సాధన చేయించడం ద్వారా వారి సామర్థ్యాలను పెంపొందించాలని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అకాడమిక్ ఫ్రేమ్ వర్క్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రతి పాఠాన్ని ప్రణాళికాబద్ధంగా బోధిస్తూ, నిరంతర మూల్యాంకనం నిర్వహించాలని, విద్యార్థులు నేర్చుకునే సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని బోధన సాగించాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు ముందస్తు ప్రణాళికతో సన్నద్ధమై తరగతి గదిలోకి వస్తే బోధన నాణ్యత గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, అక్కడ పడి ఉన్న చెట్లు, ఉపయోగం లేని ఇనుప సామగ్రిని గమనించి, వాటిని వెంటనే వేలం (ఆక్షన్) ద్వారా తొలగించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా, సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు పాఠశాల క్రీడా మైదానంలో వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తదనంతరం పాఠశాలలోని వివిధ తరగతి గదులు, మౌలిక వసతులు, పరిశుభ్రత, పాఠశాల ఆవరణను పరిశీలించి, అవసరమైన మెరుగుదలలపై అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఉత్తమ విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రతి అంశంపై ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



## పాఠాలు బోధిస్తున్నారా.. లేదా..?

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** టీచర్ డైరీ రాయకుండా టీచర్ డ్యూటీ చేస్తున్నారా అని జిల్లా కలెక్టర్ కే హైమావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మల్టీ పర్పస్ హైస్కూల్ ను జిల్లా కలెక్టర్ కే హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుల పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ ను వెరిఫై చేశారు. రిజిస్టర్ లో సంతకం చేయకుండా మధ్యాహ్న సమయంలో పలువురు ఉపాధ్యాయులు ఇంటికి వెళ్లడం పై అసహనం వ్యక్తం చేశారు. రోజు ఇలానే చేస్తున్నారా అని పాఠశాల ప్రిన్సిపాల్ ను ఆరా తీశారు. అనంతరం టీచర్ డైరీ తనిఖీ చేశారు. టీచర్ డైరీ రాయకుండా టీచర్ డ్యూటీ చేస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను చూ-స్తుంటే విద్యార్థులకు పాఠాలు సక్రమంగా బోధిస్తున్నారా అని తరగతి గదిలోకి వెళ్లిన జిల్లా కలెక్టర్ హైమావతి విద్యార్థులను తీశారు. ప్రిన్సిపాల్ కు ఉపాధ్యాయులు, మిగతా సిబ్బంది వినకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న తీరు విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉందని డీఈఓ రమేశ్ కు ఫోన్ చేసి పాఠశాల పై, ఉపాధ్యాయులు పనితీరు, విద్యార్థులకు బోధించే పాఠ్యాంశాల గూర్చి విచారణ జరపాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ వృత్తి విలువలు, వృత్తి ధర్మాన్ని కాపాడాలన్నారు. ఉపాధ్యాయుల విధుల్లో అశ్రద్ధ అంటే, విద్యార్థుల విద్య, భద్రత, పాఠశాల నిర్వహణ, తమ అధికారిక బాధ్యతలను నిర్లక్ష్యం చేయడమే అన్నారు. డీఈఓ సూచన మేరకు పాఠశాలకు చేరుకున్న సెక్టోరియల్ అధికారి రామస్వామి విద్య సంవత్సరం ప్రారంభం నుంచి పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యాంశ బోధన, ఉపాధ్యాయుల పని తీరు, టీచర్ డైరీ, లెసన్ ప్లాన్ తదితర అంశాల పై విచారణ చేపట్టారు.

# ఎస్ఎఫ్ఎం తెలంగాణ చాప్టర్ సమావేశం విజయవంతం






**ఎల్ బి నగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సొసైటీ ఆఫ్ ఫీటల్ మెడిసిన్ (ఎస్ఎఫ్ఎం), తెలంగాణ చాప్టర్, జీన్ సొల్యూషన్స్ ఇండియా సహకారంతో, జూలై 11, 2026న హైదరాబాద్‌లో తమ చాప్టర్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఎం తెలంగాణ అధ్యక్షురాలు డాక్టర్ చిన్మయి రథ, ఎస్ఎఫ్ఎం తెలంగాణ కార్యదర్శి డాక్టర్ షగున్ అగర్వాల్, మరియు జీన్ సొల్యూషన్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టాంగ్ హంగ్ సాంగ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో నూతన జన్యు సాంకేతికతలు, ప్రసవపూర్వ నిర్ధారణలో అల్ట్రాసౌండ్ -జన్యుశాస్త్ర అనుసంధానం, మరియు ఎన్ జీ ఎస్/ఏ ఐ-ఆధారిత జన్యు పరీక్షలపై సెషన్‌లతో పాటు, పాత్‌కేర్--జీన్ సొల్యూషన్స్ భాగస్వామ్య ప్రకటన మరియు భారతదేశ ప్రసవపూర్వ పరీక్షల మార్గాన్ని బలోపేతం చేయడంపై ఒక ప్యానెల్ చర్చలు జరిగాయి. ఈ సహకారం అధునాతన ప్రసవపూర్వ జన్యు సంరక్షణను ప్రజలకు మరింత చేరువ చేస్తుంది. సింగపూర్‌లో ప్రధాన కార్యాలయం మరియు హైదరాబాద్‌లో ప్రయోగశాల కార్యకలాపాలు కలిగిన జీన్ సొల్యూషన్స్, భారతదేశం అంతటా అత్యాధునిక జన్యు పరీక్షలకు ప్రాప్యతను విస్తరిస్తూనే ఉంది.

# మల్కాజ్‌గిరిలో బీజేపీకి ఎదురుదెబ్బ..



**మల్కాజ్‌గిరి,ఫ్లాష్ ఇండియా :** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని గౌతమ్‌నగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, డివిజన్ ప్రధాన కార్యదర్శి మా శెట్టి అనిల్ కుమార్ గుప్తా మంగళవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో చేరిన అనంతరం మా శెట్టి అనిల్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసేవకు ఆకర్షితుడై పార్టీలో చేరినట్లు తెలిపారు. త్వరలో తన అనుచరులు, స్నేహితులతో కలిసి మరింత మంది నాయకులు, కార్యకర్తలను బీఆర్ఎస్‌లో చేర్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాము యాదవ్, బైరు అనిల్, హేమంత్ పటేల్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, నర్సింగ్, గౌస్ ఇమ్రాన్, జక్కుల కిరణ్ ముదిరాజ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# కోదాడలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్




**కోదాడ,ఫ్లాష్ ఇండియా :** రోడ్లపై నిబంధనలు బేఖాతరు చేస్తూ ఫ్యాన్సీ నెంబర్ ప్లేట్లతో చక్కర్లు కొడుతున్న వాహనదారులపై కోదాడ ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ట్రాఫిక్ ఎస్సై అంజి రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మోటారు వాహనాల చట్టానికి విరుద్ధంగా రిజిస్ట్రేషన్ నంబర్ల స్థానంలో 'BOSS', ఇతర ఫ్యాన్సీ అక్షరాలు, ఆకర్షణీయమైన డిజైన్లతో ఉన్న నెంబర్ ప్లేట్లను గుర్తించి అక్కడికక్కడే తొలగించారు. తనిఖీల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేసి, మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. వాహనాల అసలు రిజిస్ట్రేషన్ నంబర్ స్పష్టంగా కనిపించేలా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లు ఉండాలని పోలీసులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై అంజి రెడ్డి మాట్లాడుతూ.. వాహనాలకు ఇష్టానుసారంగా పేర్లు, హోదాలు, ఫ్యాన్సీ అక్షరాలు లేదా డిజైన్లతో నంబర్ ప్లేట్లు తయారు చేయించడం చట్టవిరుద్ధమని తెలిపారు. అలాంటి వాహనాలు రోడ్లపై కనిపిస్తే ఎలాంటి మినహాయింపులు లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరి భద్రత కోసం అమలులో ఉన్నాయని, వాటిని ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రానున్న రోజుల్లో కూడా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను గౌరవించి పోలీసులకు సహకరించాలని ఎస్సై అంజి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# స్టార్ ఆల్ రౌండర్ ఎంట్రీ




ఆగస్టు 15 నుంచి భారత్, శ్రీలంక జట్ల మధ్య రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది. కాగా ఈ టెస్ట్ సిరీస్ కోసం భారత పురుషుల క్రికెట్ జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఈ రోజు (మంగళవారం) ప్రకటించింది. ఈ జట్టుకు స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. జట్టులో యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలతో పాటు కొత్తగా సరాంశ్ జైన్, గుర్‌నూర్ బ్రార్, మానవ్ సుతార్‌లకు చోటు దక్కింది. చాలా రోజుల తర్వాత స్టార్ ఆల్ రౌండర్, సీనియర్ ప్లేయర్ అయిన రవీంద్ర జడేజా తిరిగి జట్టులో స్థానం దక్కించుకున్నాడు. ఇదిలా ఉంటే ఆగస్టు 7 నుంచి కొలంబోలో జరిగే నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌తో భారత పర్యటన ప్రారంభం కానుంది. అయితే, జట్టులో ఎంపికైన స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా, బ్యాటర్ సాయి సుదర్శన్‌ల లభ్యత నేషనల్ క్రికెట్ అకాడమీ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావడంపై ఆధారపడి ఉంటుందని బోర్డు స్పష్టం చేసింది. మరోవైపు, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ అందుబాటులో లేకపోవడంతో తొలి టెస్టు ఎంపికకు ఆయన పేరును పరిగణనలోకి తీసుకోలేదు. శ్రీలంక పరిస్థితులకు అనుగుణంగా స్పిన్ విభాగంలో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లతో పాటు యువ ఆటగాళ్లకు పెద్దపీట వేస్తూ 15 మంది సభ్యులతో కూడిన బలమైన జట్టును బీసీసీఐ సిద్ధం చేసింది.

**భారత జట్టు:** శుభ్‌మన్ గిల్ [C], కెఎల్ రాహుల్ (Vc), యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ [WK], సాయి సుదర్శన్, ధృవ్ జురెల్ [WK], రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్, సరన్ష్ జైన్

# భారత్ ఖాతాలో మరో 3 పతకాలు




గ్లాస్గోలో జరుగుతున్న కామన్ వెల్త్ 2026 క్రీడల్లో భారత అథ్లెట్ల పతకాల వేట కొనసాగుతోంది. నిలకడైన ప్రతిభను కనబరుస్తూ పతకాల వేటను విజయవంతంగా కొనసాగిస్తున్న భారత క్రీడాకారులు, తాజాగా తమ ఖాతాలో ఒక స్వర్ణ పతకంతో పాటు రెండు రజత పతకాలను అందించారు. వివిధ విభాగాల్లో పోటీపడిన అథ్లెట్లు ప్రత్యర్థులకు గట్టి పోటీనిస్తూ అత్యుత్తమ ప్రదర్శనతో ఇప్పటివరకు మొత్తం 10 మెడల్స్ తో మెరిశారు. ముఖ్యంగా పారా షాట్ ఫుట్ F57 విభాగంలో భారత స్టార్ అథ్లెట్ షర్మిలా ధనకర్ తన శక్తిసామర్థ్యాలను ప్రదర్శించి బంగారు పతకాన్ని ముద్దాడారు. మరోవైపు పురుషుల హైజంప్ విభాగంలో సర్వేశ్ కుష్వారే సంచలన ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ చారిత్రాత్మక విజయంతో కామన్వెల్త్ క్రీడల చరిత్రలోనే హైజంప్ విభాగంలో పతకం సాధించిన తొలి భారతీయుడిగా సర్వేశ్ తన పేరును క్రీడా రికార్డుల్లో సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు. వీరితో పాటు వెయిట్‌లిఫ్టింగ్ 79 కేజీల విభాగంలో పల్లూరి అజయ్ బాబు వెండి పతకాన్ని సొంతం చేసుకున్నారు. బార్‌బెల్‌ను సునాయాసంగా ఎత్తుతూ క్లీన్ అండ్ జెర్క్, స్నాచ్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన చేసారు. ఒకే రోజున అటు పారా అథ్లెటిక్స్, ఇటు ట్రాక్ అండ్ ఫీల్డ్, వెయిట్‌లిఫ్టింగ్ విభాగాల్లో వరుస పతకాలు వరించడంతో భారత క్రీడాభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇప్పటివరకు భారత్ అందుకున్న 10 పతకాలతో మెడల్స్ లిస్ట్ టేబుల్ లో 8వ స్థానంలో ఉంది.

# బీసీసీఐకి పెద్ద తలనొప్పి!



భారత టీ20 జట్టులో ఓపెనింగ్ బ్యాటర్ల ఎంపిక ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీసింది. 2026 టీ20 ప్రపంచ కప్ విజయంలో అభిషేక్ శర్మ, సంజు శాంసన్ కీలక పాత్ర పోషించినప్పటికీ.. తాజాగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రాకతో జట్టు సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఇటీవల జింబాబ్వేతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌లో 151 పరుగులతో అదరగొట్టిన బుడ్డోడు.. 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు కూడా గెలుచుకున్నాడు. తన దూకుడు ఆటతో వైభవ్ ఓపెనింగ్ స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకున్నాడు. మరోవైపు అభిషేక్ శర్మ వరుసగా ఐదు ఇన్నింగ్స్‌ల్లో పరుగులు చేయలేకపోవంతో అతనిపై ఒత్తిడి పెరిగింది. ప్రపంచ నంబర్-1 టీ20 బ్యాటర్‌గా గుర్తింపు పొందిన అభిషేక్ ఫామ్‌పై ప్రశ్నలు తలెత్తుతున్న వేళ.. సంజు శాంసన్‌కు మళ్లీ భారత జట్టులో అవకాశం ఇవ్వాలనే డిమాండ్ బలపడుతోంది. ఈ అంశంపై భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా స్పందించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో అభిషేక్ బ్యాటింగ్‌ను ప్రత్యర్థి జట్లు బాగా అర్థం చేసుకున్నాయని, అందుకే ఇప్పుడు సెలెక్టర్లు కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. సంజుకు మళ్లీ జట్టులో అవకాశం రావడం ఖాయమని, సెలక్షన్ కమిటీ ధైర్యంగా నిర్ణయం తీసుకోవాలని క్రిస్ తన యూట్యూబ్ ఛానెల్‌లో పేర్కొన్నారు. సంజు శాంసన్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో భారత క్రికెట్‌లో కొనసాగుతున్న తీవ్ర పోటీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఇకపై ఆ 'ర్యాట్ రేస్'లో భాగం కావాలని అనుకోవడం లేదని, 2026 టీ20 ప్రపంచ కప్‌కు ముందే ఆ నిర్ణయం తీసుకున్నానని చెప్పాడు. 'నేను ఆటను ఆస్వాదించాలని మాత్రమే కోరుకుంటున్నాను. దేవుడి దయ-ంతో ఇప్పటికే చాలా సాధించాను. ప్రస్తుతం నాకు 31 సంవత్సరాలు. ఇంకా కొన్ని సంవత్సరాలు క్రికెట్ ఆడే అవకాశం ఉంది. అందుకే ఇకపై నా నిర్ణయాల ప్రకారమే ఆడతాను. ఎలా బ్యాటింగ్ చేయాలో, ఏమి చేయాలో ఎవరూ నాకు చెప్పాల్సిన అవ-సరం లేదు' అని శాంసన్ స్పష్టం విమ-ర్శకులకు గట్టిగా బదులిచ్చాడు. వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శన, అభిషేక్ శర్మ పేలవ ఫామ్, సంజు శాంసన్ అనుభవం నేపథ్యంలో భారత టీ20 జట్టులో ఓపెనింగ్ జోడీ ఎంపిక సెలెక్టర్లకు ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది. రానున్న సిరీస్‌లలో భారత జట్టు యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మొత్తంగా వైభవ్ ఎంట్రీతో ఇప్పుడు సెలెక్టర్లకు పెద్ద తలనొప్పి మొదలైంది. ముగ్గురిని ఎంపిక చేసినా.. ఇద్దరే ఓపెనింగ్ చేస్తారు. అప్పుడు కూడా బీసీసీఐపై విమర్శలు వస్తాయి. మరి దీనిని బీసీసీఐ ఎలా హ్యాండిల్ చేస్తుందో చూడాలి.

# వెయిట్‌లిఫ్టింగ్‌లో మెరిసిన జ్ఞానేశ్వరి..




కామన్వెల్త్ క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టర్లు పతకాల పంట పండిస్తున్నారు. సోమవారం జరిగిన మహిళల 53 కిలోల ఫైనల్స్‌లో భారత యువ లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్ అద్భుత ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ తుది పోరులో నైజీరియా లిఫ్టర్ ఓనోమ్ ఓమోలోలా దీదీకి ఆఖరి వరకూ గట్టి పోటీ నిచ్చిన జ్ఞానేశ్వరి.. స్నాచ్‌లో 88 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కిలోలు ఎత్తి మొత్తంగా 199 కిలోల బరువుతో రెండో స్థానంలో నిలిచింది. నైజీరియా లిఫ్టర్ రికార్డు స్థాయిలో 206 కిలోలతో స్వర్ణం సాధించగా, కెనడాకు చెందిన రెబెకా గ్రౌల్ఫ్ (178 కిలోలు) కాంస్యం దక్కించుకుంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 23 ఏళ్ల జ్ఞానేశ్వరి.. ఒలింపిక్ పతక విజేత మీరాబాయి చానుతో పోటీని తప్పించుకునేందుకే 49 కిలోల నుంచి 53 కిలోల విభాగానికి మారి, తన నిర్ణయం సరైనదేనని ఈ పతకంతో నిరూపించుకుంది.

**మీరాబాయి చానుకు హ్యాట్రిక్ స్వర్ణం..**

అంతకుముందు వెయిట్‌లిఫ్టింగ్ క్వీన్ మీరాబాయి చాను మహిళల 48 కిలోల విభాగంలో ఏకంగా 190 కిలోలు ఎత్తి భారత్‌కు తొలి స్వర్ణాన్ని అందించింది. కామన్వెల్త్ క్రీడల్లో (2018, 2022 తర్వాత) ఆమెకు ఇది వరుసగా మూడో స్వర్ణం కావడం విశేషం. తాజా విజయాలతో ఈ క్రీడల్లో భారత్ పతకాల సంఖ్య ఐదుకు (1 స్వర్ణం, 3 రజతాలు, 1 కాంస్యం) చేరుకుంది.


# బిజినెస్




## కొనుగోలుదారులకు ఊరట..

గత కొద్ది రోజులుగా బంగారం ధరలు పెరుగుతూ, తగ్గుతూ వినియోగదారులను అయోమయంలో పడేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా మంగళవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో పసిడి ధరలు క్షీణించడంతో వినియోగదారులకు ఊరట లభించినట్లయింది. ఇవాళ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,690 తగ్గి, రూ.1,44,170కి చేరుకుంది. అదేవిధంగా ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా రూ.1,550 మేర పతనమై రూ.1,32,150 వద్ద పలుకుతోంది. బంగారంతో పాటు వెండి ధర కూడా దిగివచ్చింది. కేజీ వెండి ధరపై ఏకంగా రూ.5,000 తగ్గి, ప్రస్తుతం రూ.2,35,000గా నమోదైంది. అయితే తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాలు, పట్టణాలను బట్టి ఈ స్థానిక స్థానిక పన్నులు, దుకాణాల వ్యయాల ఆధారంగా ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉంది. కాగా, వ్యాపారులు ప్రకటించే ఈ నిమిషాల ధరలపై 3 శాతం జీఎస్టీ (GST) అదనంగా వర్తిస్తుందని బులియన్ నిపుణులు స్పష్టం చేశారు.

# లిస్టింగ్‌తోనే లక్షల్లో లాభాలు!



ప్రపంచవ్యాప్తంగా ఐపీఓల హవా కొనసాగుతున్న వేళ, చైనాకు చెందిన ఓ చిప్ తయారీ సంస్థ షేర్ మార్కెట్‌లో సంచలనం సృష్టించింది. షాంఘై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో సోమవారం లిస్టింగ్ అయిన చాంగ్‌క్సిన్ మెమరీ టెక్నాలజీస్ (CXMT) షేర్లు తొలి రోజే దాదాపు 500 శాతం ఎగిసి పడటంతో పెట్టుబడిదారులు భారీ లాభాలు ఆర్జించారు. ఈ బ్లాక్‌బస్టర్ లిస్టింగ్ ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్థిక వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాయిటర్స్ నివేదిక ప్రకారం.. కంపెనీ తన ఐపీఓలో ఒక్కో షేర్ ధరను 8.66 యువాన్‌గా నిర్ణయించింది. అయితే షాంఘై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్ అయిన వెంటనే షేర్లు అమాంతం ఎగబాకి 55.02 యువాన్ గరిష్ట స్థాయిని తాకాయి. అనంతరం కొంత లాభాల స్వీకరణ జరిగినప్పటికీ, ట్రేడింగ్ ముగిసే సమయానికి షేర్ ధర 49 యువాన్ వద్ద నిలిచి, ఐపీఓ ధరతో పోలిస్తే 465.82 శాతం లాభాన్ని నమోదు చేసింది. ఈ అద్భుతమైన లిస్టింగ్‌తో CXMT మార్కెట్ విలువ సుమారు 3.3 ట్రిలియన్ యువాన్లు (487 బిలియన్ డాలర్లు)కు చేరుకుంది. దీంతో మెయిన్‌ల్యాండ్ చైనాలో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీల్లో ఒకటిగా నిలిచింది. కంపెనీ షేర్లలో పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్లకు తొలి రోజే భారీ సంపద సృష్టించిన ఐపీఓగా ఇది ప్రత్యేక గుర్తింపు పొందింది. 2016లో వ్యాపారవేత్త జూ యిమింగ్ స్థాపించిన CXMT ప్రధాన కార్యాలయం చైనాలోని అన్హుయ్ ప్రావిన్స్‌లోని హెఫే నగరంలో ఉంది. ఈ సంస్థ డైనమిక్ ర్యాండమ్ యాక్సెస్ మెమరీ (DRAM) చిప్‌లను తయారు చేస్తుంది. ఈ చిప్‌లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) డేటా సెంటర్లు, స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ట్యాబ్లెట్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాల్లో విస్తృతంగా ఉపయోగిస్తారు. ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ కంపెనీల షేర్లపై ఇటీవల ఒత్తిడి నెలకొన్నప్పటికీ, CXMT మాత్రం అంచనాలను మించి బలమైన అరంగేట్రం చేసింది. మెమరీ చిప్‌లకు పెరుగుతున్న డిమాండ్, పరిమిత సరఫరా కారణంగానే కంపెనీ షేర్లు ఈ స్థాయిలో దూసుకెళ్లాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ లిస్టింగ్‌తో కంపెనీ వ్యవస్థాపకుడు జూ యిమింగ్ సంపద కూడా గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది.

# గ్యాస్ సిలిండర్ ధరలు ఇవే!




ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,191గా ఉంది. ఇక, గృహ వినియోగ ఎల్‌పిజి ధ-రల్లో ఎలాంటి మార్పులు లేవు. నేడు(మంగళవారం) తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**జులై 28వ తేదీన గ్యాస్ సిలిండర్ ధరలు..**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50

# ఒత్తిడిలో బ్యాంకింగ్ సూచీలు..




అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో సూచీలు సానుకూలంగా కదలాడుతున్నాయి. అయితే బ్యాంకింగ్ సెక్టార్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలను వెనక్కి లాగుతోంది. సోమవారం భారీ లాభాల నేపథ్యంలో గరిష్ఠాల వద్ద మదుపర్లు అమ్మకాలకు మొగ్గుచూపుతున్నారు. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ (95. 68) బలపడింది. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (76,835)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల్లోకి వచ్చింది. ఉదయం 9:40 గంటల సమయంలో సెన్సెక్స్ 92 పాయింట్ల లాభంతో 76,928 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 24 పాయింట్ల లాభంతో 24,020 వద్ద ఉంది. మళ్లీ 24 వేల మార్క్‌ను దాటింది. సెన్సెక్స్, నిఫ్టీలో కోఫోర్జ్, లోధా డెవలపర్స్, ఎంఫసిస్, పెర్సిస్టెంట్, టీసీఎస్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. గాడ్రేజ్ ఫిలిప్స్, సీజీ పవర్, భారత్ ఎలక్ట్రిక్, కోల్ ఇండియా, వెర్నోవా టీడీ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 219 పాయింట్ల నష్టంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 76 పాయింట్ల లాభంతో ఉంది.

# నా ఫ్యామిలీ సపోర్ట్ చేయలేదు..



సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టడానికి ముందు కుటుంబంలో ఎలాంటి తీవ్రమైన పరిస్థితులు ఎదురయ్యాయో గుర్తు చేసుకుని ఎమోషనల్ అయ్యారు. తాను మోడలింగ్, సినిమాల్లోకి వెళ్తానని మొదట తన తల్లికి ఫోన్ చేసి చెప్పినప్పుడు, ఆమె ఎలాంటి ఆలోచన లేకుండా వెంటనే వద్దని ఖరాఖండిగా చెప్పినట్లు తెలిపారు. ఆ తర్వాత ధైర్యం చేసి తన నాన్నకు ఫోన్ చేయగా, అమ్మ వద్దని చెప్పిన పనిని నువ్వు ఎలా చేస్తావంటూ ఆయన గద్దించి వెంటనే ఫోన్ కట్ చేశారని వెల్లడించారు. ఇంట్లో తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో, కనీసం తన అక్క అయినా తన ఇష్టాన్ని అర్థం చేసుకుని ఒప్పుకుంటుందనే నమ్మకంతో ఆమెకు కాల్ చేసినప్పటికీ అక్కడి నుంచి కూడా నిరాశే ఎదురైందని చెప్పారు. అయినప్పటికీ తనకు నటన, సినీ ఇండస్ట్రీపై ఉన్న అపారమైన మక్కువతో ఎవరి మాట వినకుండా ధైర్యంతో ఆడిషన్లు ఇచ్చానని భాగ్యశ్రీ తెలిపారు. దానివల్ల ఒక్కసారిగా తమ ఇంట్లో వాతావరణం మరియు పరిస్థితులు మారిపోయాయని అన్నారు. తాను చెప్పినా వినకుండా సినిమాల కోసం ఆడిషన్లకు వెళ్లడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన తల్లి, తనను వెంటనే వాట్సాప్‌లో బ్లాక్ చేయడమే కాకుండా దాదాపు ఆరు నెలల పాటు తనతో మాట్లాడలేదని చెప్పారు. ఆ సమయంలో తాను తీవ్రంగా మానసిక బాధ అనుభవించానని భాగ్యశ్రీ వెల్లడించారు. అయితే ఆ తర్వాత తాను సినిమాల్లో సాధించిన విజయాన్ని, పడిన కష్టాన్ని ప్రత్యక్షంగా చూశాక తన తల్లికి, కుటుంబ సభ్యులందరికీ తనపై పూర్తి నమ్మకం ఏర్పడిందని సంతోషం వ్యక్తం చేశారు.

# ఆకట్టుకునేలా 'అనకాపల్లి'




తాజాగా విశాఖపట్నంలో వైభవంగా జరిగిన ఎలైట్ క్రికెట్ లీగ్ సీజన్ 2 వేదికపై 'అనకాపల్లి' చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. టాలీవుడ్ థండర్స్ టీమ్‌తో పాటు హీరోలు శ్రీకాంత్, సుధీర్ బాబు, తరుణ్, అశ్విన్ బాబు మరియు ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. థమన్ తదితరులు వేలాది మంది అభిమానుల సమక్షంలో ఈ ట్రైలర్‌ను ఆవిష్కరించి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు.విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా తారాస్థాయికి చేర్చింది. హీరో హీరోయిన్ల మధ్య సాగే ప్రేమకథ ఎంతో ఫ్రెష్‌గా ఉండటంతో పాటు, తారక్ పొన్నప్ప పవర్‌ఫుల్ విలనిజం సినిమాకి ప్రధాన హైలైట్‌గా నిలవనుంది. ఎంతో నేచురల్‌గా కట్ చేసిన యాక్షన్ సీక్వెన్సులు మాస్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకునేలా ఉన్నాయి. మిడిల్ క్లాస్ తల్లిదండ్రులుగా త్రినాథరావు నక్కిన, ఇంద్రజ నటిస్తున్న తీరు చూస్తుంటే కుటుంబ ప్రేక్షకులకు కావాల్సినంత భావోద్వేగం ఈ చిత్రంలో ఉందని స్పష్టమవుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను టార్గెట్ చేస్తూ యూత్, మాస్, ఫ్యామిలీ ఆడియెన్స్‌కు నచ్చే అన్ని హంగులతో ఈ ట్రైలర్‌ను రూపొందించారు.




# దసరా మ్యాజిక్ రిపీట్..

నేచురల్ స్టార్ నాని హీరోగా, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న రెండొవ ప్రాజెక్టు కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ సరవేంగా శరవేగంగా జరుగుతుంది. అయితే.. ఈ మూవీ ఆగస్టులో రిలీజ్ చేయాలని మొదట మేకర్స్ ప్లాన్ చెయ్యగా.. షూటింగ్ లేట్ అయిన కారణంగా సెప్టెంబర్ మంత్‌కు పోస్ట్ పోన్ అయింది. రిలీజ్ డేట్‌పై త్వరలో మేకర్స్ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇవ్వనున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌కు సంబంధించిన క్రేజీ అప్డేట్ ఒకటి నెట్టింట చక్కర్లు కొడుతోంది.ది ప్యారడైజ్ చిత్రంలోని ప్రత్యేక గీతం కోసం ఒక నటి ఖరారయ్యారని తెలుస్తుంది. ఈ మేరకు చిత్ర బృందం నుండి అందిన సమాచారం ప్రకారం.. కీర్తి సురేష్‌ను స్పెషల్ సాంగ్ కోసం ఎంపిక చేశారట. ఆమె నానితో కలిసి ఈ పాటలో స్టెప్పులు వేసే అవకాశం ఎక్కువగా ఉందని.. త్వరలోనే దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని టాక్. ఇదే కన్ఫర్మ్ అయితే.. నానితో కీర్తికి ఇది మూడవ చిత్రం కాగా, దర్శకుడు శ్రీకాంత్ ఒదులతో రెండవ చిత్రం కానుంది. కాగా.. ఈ మూవీలో కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మోహన్ బాబు, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని అత్యంత గ్రాండ్‌గా నిర్మిస్తున్నాడు.



# 'ఓం' రిలీజ్ డేట్ ట్విస్ట్..

ఈ రోజు తమిళ స్టార్ హీరో ధనుష్ పుట్టినరోజు సందర్భంగా ఆయన కొత్త సినిమా 'ఓం' నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలకు రంగం సిద్ధమైంది. అభిమానులు అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్న వేళ, చిత్రబృందం విడుదల చేసిన తాజా పోస్టర్లు మరో పెద్ద చర్చకు దారితీశాయి. గతంలో ఆఫీషియల్‌గా అనౌన్స్ చేసిన 2026 అక్టోబర్ 16 రిలీజ్ డేట్ ఈ పోస్టర్లలో కనిపించకపోవడంతో, సినిమా వాయిదా పడే అవకాశాలపై పరిశ్రమలో ఊహాగానాలు మరోసారి జోరందుకున్నాయి. అయితే ఈ మార్పు వెనుక ప్రధాన కారణంగా రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2'తో బాక్సాఫీస్ పోటీని భావిస్తున్నారు. ప్రస్తుతం రెండు సినిమాలు ఒకే తేదీకి రావాల్సి ఉండటంతో, భారీ స్థాయి క్లాష్‌ను నివారించేందుకు నిర్మాతలు ప్రత్యామ్నాయన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రజనీకాంత్ సినిమాకు ఉన్న భారీ మార్కెట్ దృష్ట్యా, 'ఓం'కు మరింత అనుకూలమైన విండో కోసం అన్వేషణ జరుగుతోందని సమాచారం.అయితే ఇది కేవలం రిలీజ్ డేట్ సమస్య మాత్రమే కాదని తాజా కథనాలు సూచిస్తున్నాయి. ఈ మూవీకి సంబంధించిన థియేటర్ల తర్వాతి స్ట్రీమింగ్ హక్కులు నెట్‌ఫ్లిక్స్ వద్ద ఉన్నాయని, ఆ ఒప్పందం మొదట అక్టోబర్ 16 విడుదల తేదీని ఆధారంగా చేసుకుని రూపొందించబడిందని తెలుస్తోంది. అందువల్ల రిలీజ్ డేట్ మారితే, థియేట్రికల్ రన్, ఓటీటీ స్ట్రీమింగ్ మధ్య గ్యాప్‌ను కూడా తిరిగి మార్చాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. సినీ పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, ధనుష్‌తో పాటు చిత్రబృందంలోని కీలక సభ్యులు ముంబైలో నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులతో సమావేశమయ్యే అవకాశముంది. ఈ చర్చల్లో కొత్త థియేట్రికల్ విడుదల తేదీ, దానికి అనుగుణంగా ఓటీటీ స్ట్రీమింగ్ షెడ్యూల్‌ను ఖరారు చేసే అంశాలు ప్రధానంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. చర్చలు సానుకూలంగా ముగిస్తే, దీపావళి 2026ను లక్ష్యంగా పెట్టుకుని కొత్త విడుదల తేదీ ప్రకటించే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. లేదంటే సినిమా తన అసలు తేదీకే కట్టుబడి 'జైలర్ 2'తో నేరుగా పోటీ పడే అవకాశం ఉంది.ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. ధనుష్‌తో పాటు మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల, ఇంద్రన్స్, నసీరుద్దీన్ షా, చైతు జొన్నలగడ్డ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వండర్‌బార్ ఫిల్మ్స్ మరియు ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ప్రస్తుతం అభిమానుల దృష్టి రెండు అంశాలపై నిలిచింది. ఒకటి ఈరోజు విడుదల కానున్న ఫస్ట్ సింగిల్ ఎలా ఉంటుందనేది. రెండోది, 'ఓం' నిజంగా అక్టోబర్ 16న వస్తుందా లేక దీపావళి బరిలోకి మారుతుందా అన్నదే. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ సస్పెన్స్ కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.




# కెమిస్ట్రీ అదిరిపోయిందిగా..

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తొలిసారి జంటగా నటిస్తున్న పాన్-ఇండియా రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'శ్రీ శ్రీ' పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు రవి నెలకుదిటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సంస్థకు ఇది 10వ చిత్రం కాగా.. ఇషాన్ సక్సేనా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, వర్కింగ్ స్టిల్స్‌కు మంచి స్పందన లభించగా.. తాజాగా చిత్రబృందం మొదటి పాటగా 'బొమ్మ బొమ్మ'ను విడుదల చేసి సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది.'బొమ్మ బొమ్మ' పాట ప్రేమలోని తొలి అనుభూతిని ఎంతో అందంగా తెరపై ఆవిష్కరించింది. రైల్వే స్టేషన్‌లో ఓ బెంచ్‌పై కూర్చున్న దుల్కర్ సల్మాన్, ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చిన పూజా హెగ్డేను తొలిసారి చూసిన క్షణంలోనే ఆమె ప్రేమలో పడే సన్నివేశాలతో పాట ప్రారంభమవుతుంది. ఈ మెలోడీకి సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ తనదైన శైలిలో హృదయాన్ని హత్తుకునే స్వరాలను అందించారు. సింపుల్ అయినా ఆకట్టుకునే ట్యూన్‌కు క్లాసీ ఆర్కెస్ట్రేషన్ జోడించి పాటను మరింత స్పెషల్ గా మార్చారు. అనంత ఈ పాటకు శ్రీరామ్ తన సాహిత్యం అందించగా..
గాయకుడు కపిల్ కపిలన్ తన మృదువైన గాత్రంతో పాటకు మరింత ప్రాణం పోశారు. రామ్ మాస్టర్ కొరియోగ్రఫీ ప్రతి సన్నివేశాన్ని అందంగా తెరకెక్కించాడు.

# 24 ఏళ్ల క్రికెటర్‌తో...

తాజాగా, ఓ 24 ఏళ్ల టీమిండియా యంగ్ క్రికెటర్‌తో మృణాల్ డేటింగ్‌లో ఉందంటూ సరికొత్త ప్రచారం మొదలైంది. ఆ యంగ్ క్రికెటర్ మరెవరో కాదు, టీమిండియా క్రేజీ ప్లేయర్ యశస్వి జైస్వాల్.వీరిద్దరూ ప్రేమలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు చర్చనీయాంశంగా మారాయి. ఈ రూమర్లకు ముంబైలోని బాంద్రా వెస్ట్‌లో ఉన్న 'బూజీ కేఫే' కారణం. ఇటీవల ఒకే సమయంలో మృణాల్ కేఫే లోపల కనిపిస్తుండగా, సరిగ్గా అదే కేఫే నుంచి యశస్వి జైస్వాల్ బయటకు వచ్చి కారులో వెళ్లిపోతూ కెమెరాలకు చిక్కాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్‌గా మారింది. అది చూసిన నెటిజన్లు వీరు తమ రిలేషన్‌షిప్‌ను చాలా సీక్రెట్‌గా నడిపిస్తున్నారని కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. అయితే ఈ వైరల్ వీడియోపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇవి కేవలం ఫేక్ రూమర్లు మాత్రమేనని ఖండిస్తుండగా, మరికొందరు మాత్రం మృణాల్, జైస్వాల్ మధ్య దాదాపు 9 ఏళ్ల వయసు వ్యత్యాసం ఉందంటూ సోషల్ మీడియా వేదికగా చర్చించుకుంటున్నారు.




# టాలీవుడ్‌లో గాయాల షాక్..



ఇటీవలి కాలంలో టాలీవుడ్ అగ్ర హీరోలు వరుసగా గాయాల బారిన పడటం అభిమానుల్లో ఆందోళన కలిగిస్తోంది. యాక్షన్ సీక్వెన్స్ కోసం రిస్క్ తీసుకుంటూ పనిచేస్తున్న స్టార్ హీరోలు ఒక్కొక్కరుగా శస్త్రచికిత్సలు చేయించుకోవాల్సిన పరిస్థితి రావడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఆసక్తికరంగా మెగా, నందమూరి కుటుంబాల నుంచి 'బాబాయ్-అబ్బాయి' జంటలు ఈ జాబితాలో ఉండటం చర్చకు దారితీసింది. మొదట పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భుజానికి శస్త్రచికిత్స జరిగింది. ఆ తర్వాత నటసింహం బాలకృష్ణ తన 111వ సినిమా షూటింగ్ సందర్భంగా యాక్షన్ సన్నివేశాల్లో గాయపడటంతో మోకాలికి సర్జరీ చేయించుకున్నారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ పరిణామం తర్వాత మరో ఇద్దరు స్టార్ హీరోలు కూడా గాయాల కారణంగా చికిత్స తీసుకోవాల్సి రావడం అభిమానులను కలవరపెడుతోంది.'పెద్ది' సినిమా కుస్తీ సన్నివేశాల షూటింగ్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మణికట్టుకు గాయం అయింది. దీని తీవ్రత కారణంగా వైద్యుల సూచన మేరకు కోయంబత్తూరులో నిన్న శస్త్రచికిత్స కూడా చేయించుకున్నారు. ఇక పూర్తిగా కోలుకున్న తర్వాతే ఆయన తదుపరి ప్రాజెక్టుల షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ కూడా భుజానికి గాయం కావడంతో కొంతకాలం విశ్రాంతి తీసుకోనున్నట్లు సమాచారం. ఆయన ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్టుల షెడ్యూల్‌కు అనుగుణంగా విశ్రాంతి తీసుకుని తిరిగి షూటింగ్‌లో పాల్గొనేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల్లో ప్రత్యేకంగా చర్చకు వస్తున్న అంశం ఏమిటంటే, మెగా కుటుంబం నుంచి పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ ఒక జంటగా, నందమూరి కుటుంబం నుంచి బాలకృష్ణ, ఎన్టీఆర్ మరో జంటగా గాయాల బారిన పడటం. ఇది యాదృచ్ఛికమే అయినప్పటికీ, అభిమానులు మాత్రం వరుస సంఘటనలతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అయితే ఈ గాయాల ప్రభావం పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, ఎన్టీఆర్ సినిమాల షూటింగ్ షెడ్యూల్‌లపై పెద్దగా ప్రభావం పడే అవకాశం లేదని సమాచారం. కానీ డిసెంబర్ విడుదల లక్ష్యంగా రూపొందుతున్న బాలకృష్ణ చీదీఖ111 మూవీపై మాత్రం కొంత ప్రభావం కనిపించే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. షూటింగ్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. స్టార్ హీరోలు తమ సినిమాల కోసం డూప్‌లకు బదులుగా స్వయంగా యాక్షన్ సీక్వెన్స్ లలో పాల్గొంటూ అభిమానులను అలరిస్తుంటారు. అదే సమయంలో ఇలాంటి రిస్క్‌ల వల్ల గాయాలు కూడా తప్పడం లేదు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్, బాలకృష్ణ, రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ త్వరగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లలో పాల్గొనాలని అభిమానులందరూ ఆకాంక్షిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**